

48 గంటల పాటు మద్యం దుకాణాలు బంద్ 7లో

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న జేసీ

ద్రాక్షారామ, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):రామచంద్రపురం మండలం ఓదూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ నిషాంతి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు తీరును పరిశీలించారు. రైతు భరోసా కేంద్రం హాజరు పట్టి పరిశీలించారు. ధాన్యం ఏ మేరకు మిల్లులకు పంపించాల్సి ఉందనేదానిపై ఆరా తీశారు. అనంతరం రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించుకోవాలని, దళారులను ఆశ్రయించవద్దని సూచించారు. తుఫాన్ నేపథ్యంలో ధాన్యం రాశులు ఉంటే జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలని మండల వ్యవసాయాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో దేవరకొండ అఖిల, ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మాధురి, మండల వ్యవసాయాధికారి సత్యప్రసాద్, వ్యవసాయ సహాయకులు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

ప్రద్యుమ్న పూజలు



స్వామివారిని దర్శించుకుంటున్న ప్రద్యుమ్న దంపతులు

ద్రాక్షారామ, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న సోమవారం సతీసమేతంగా సందర్శించారు. భీమేశ్వరస్వామివారిని, మాణిక్యాంబ అమ్మవారిని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం బేడా మండపంలో ప్రద్యుమ్న దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందచేశారు. ఆలయ సహాయ కమిషనరు అల్లు భవానీ స్వామి వారి ప్రసాదం అందచేశారు. ఆలయానికి వచ్చిన ప్రద్యుమ్న దంపతులకు జేసీ నిషాంతి, ఆర్డీవో దేవరకొండ అఖిల, ఇన్‌చార్జి తహసీల్దార్ మాధురి స్వాగతం పలికారు.

కష్టాల కౌంట్ పెరిగింది..



ఆక్వా సాగు భారమైంది..

ఆక్వా సాగుపై రైతుల్లో తగ్గుతున్న ఆసక్తి

ఉపాధి కోల్పోతున్న కార్మికులు

రైతుల కష్టాన్ని దోచుకుంటున్న 'గుత్తాధిపత్యం'

అందని రాయితీలు

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి):

ఆక్వా సాగును బలోపేతం చేసేందుకు ఉత్పత్తి ఖర్చులను తగ్గించి రైతులకు లాభాలకు చేకూర్చేందుకు కేంద్ర బడ్జెట్‌లో (2024-25) ఇన్‌పుట్స్‌పై దిగుమతి సుంకాన్ని భారీగా తగ్గించారు. అయితే అవి నేటికీ అమలు కాకపోవడంతో ఆక్వా రైతులు నష్టపోతున్నారు. ఎగుమతిదారులు, ఫీడు కంపెనీలు, హేచరీలు, సీడు కంపెనీలు గుత్తాధిపత్యంతో ఆక్వా రైతులను దోచుకుంటున్నాయి. దీంతో ఆక్వా సాగు రైతుకు భారంగా మారుతోంది.

కుదేలైన ఆక్వా రైతులు

ఆక్వారంగంలో ఆటుపోట్లు ఎదురవ్వడంతో ఆక్వాసాగు చేసే రైతులు కుదేలవుతున్నారు. చెరువులో రొయ్య పిల్లలు వేసేటప్పుడు ఉన్న రేటు చెరువులు పట్టుబడికి వచ్చే సమయానికి లేకపోవడంతో రైతులు భారీగా నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. దీంతో నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులు ఆక్వాసాగుకు స్వస్తి పలికి ప్రత్యామ్నాయ వృత్తుల వైపు చూస్తున్నారు. ఆక్వా రంగంతో పాటు సాఫ్ట్‌వేర్ రంగం కూడా సంక్షోభంలో ఉండడంతో ప్రజల్లో రానురాను కొనుగోలు సామర్థ్యం తగ్గిపోతుంది. దీంతో భూముల రేట్లు కూడా పతనమవుతున్నాయి. ఆక్వా సాగుపై ప్రత్యక్షంగాను, పరోక్షంగాను వేలాది మంది ఉపాధి పొందుతున్నారు. ఆక్వాసాగు తగ్గడంతో వారికి ఉపాధి కరవవుతుంది.

అందని రాయితీలు

రొయ్యల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇన్‌పుట్స్‌పై దిగుమంతి సుంకం తగ్గించింది. వీటిలో తల్లిరొయ్యకు సంబంధించి బ్రూడస్టాక్ రొయ్యలపై కస్టమ్స్ డ్యూటీ 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించగా తల్లిరొయ్య మేతకు సంబంధించి పాలీచెట్ పురుగులపై 30 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. రొయ్యలు, చేపల మేతలపై 15 శాతం నుంచి 5 శాతం తగ్గించారు. రొయ్యల మేతలో కలిపి వాడే మినరల్స్, విటమిన్ ప్రీమిక్స్, క్రిల్‌మీల్, ఫిష్‌లిపిడ్ ఆయిల్, క్రూడ్‌ఫిష్ ఆయిల్, ఆల్గల్ ప్రైమ్(పౌడర్), ఆల్గల్ ఆయిల్, అలాగే రొయ్యల పిల్లల ఫీడుకు సంబంధించి ఆర్టెమియా, ఆర్టెమియా సిస్ట్ వంటి వాటిని ఇన్‌పుట్ సబ్సిడీలు కస్టమ్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయింపు ఇచ్చారు. అయినా ఇప్పటి వరకు రైతులకు మాత్రం ఆ మినహాయింపు రాయితీలు అందడం లేదు. ఫీడ్‌కు సంబంధించి టన్నుకు రూ.20 వేల నుంచి రూ.25వేలకు నష్టపోతున్నారు. రొయ్యపిల్లకు సంబంధించి కొనుగోలులో 10 పైసలు నష్టపోతున్నారు.





షాకిచ్చిన 'ట్రాన్స్‌ఫార్మర్'

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.10 లక్షల లోపు వాటికి 10శాతం ప్రభుత్వానికి చెల్లిస్తే వారు బయట ఇష్టమొచ్చిన ఏజెన్సీల వద్ద వాటిని కొనుగోలు చేసుకునే విధానం ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం ఆ పరిమితిని రూ.40 లక్షలకు పెంచడంతో ఆక్వా రైతులకు ఉపయోగ పడడం లేదు. కొనుగోలుదారుడిపై 50 శాతం అధిక భారం పడుతుంది. వైసీపీ ప్రభుత్వం షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్ కంపెనీలోనే ట్రాన్స్‌పార్మర్లు కొనుగోలు చేయాలని మెలిక పెట్టడంతో రైతులు ఆ కంపెనీ వద్దే ట్రాన్స్‌పార్మర్లు కొనుగోలు చేయాల్సి వస్తుంది. 25 కేవీ ట్రాన్స్‌పార్మర్ బయట కొనుగోలు చేస్తుంటే రూ.2 లక్షల 25వేల వరకు అవుతుంటే ప్రభుత్వం నిర్ణయించిన కంపెనీ వద్ద కొనుగోలు చేస్తే రూ.5 లక్షల వరకు అవుతుంది. దీంతో ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆక్వారైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. ఆక్వా సాగులో నిబంధనలు సడలించి యూనిట్‌ను రూ.1.50కే అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ సబ్సిడీలో అవగాహన లోపం

జిల్లాలో 2018లో 30,400 ఎకరాల్లో ఆక్వాజోన్ పరిధిలో ఆక్వా సాగు అవుతున్నట్టు మత్స్యశాఖ గుర్తించింది. ఆ తర్వాత 2019లో వైసీపీ ప్రభుత్వం మరో 9,687 ఎకరాలు ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకువచ్చింది. మొత్తం 40087 ఎకరాల్లో ఆక్వా సాగును ఆక్వాజోన్ పరిధిలోకి తీసుకురాగా విద్యుత్ సబ్సిడీ విషయంలో వైసీపీ ప్రభుత్వం అవగాహనా లోపంతో ఈ-ఫిష్ సర్వే పేరిట ఆక్వా జోన్, నాన్ ఆక్వాజోన్‌లుగా విభజించి ఆక్వాజోన్ పరిధిలో ఉన్న వాటిని యూనిట్ విద్యుత్ రూపాయి 50 పైసలకు సబ్సిడీపై అందించారు. మ్యాపింగ్, డబుల్‌ఎంట్రీ, ర్యాంగ్ మ్యాపింగ్, హార్టీకల్చర్, అగ్రికల్చర్ వంటి వాటిని సాకుగా చూపి ఆక్వాజోన్ నుంచి 12వేల ఎకరాలు తొలగించారు. జిల్లాలో మొత్తం 5862 విద్యుత్ కనెక్షన్లు ఉండగా 1290 విద్యుత్ కనెక్షన్లు ఆక్వాజోన్ నుంచి తొలగించారు. దీంతో కేవలం 4,572 కనెక్షన్లకు మాత్రమే సబ్సిడీ వర్తిస్తుంది. ఆక్వా రైతులకు జోన్ పరిధిలో యూనిట్‌కు రూ.1.50 కాగా నాన్‌ఆక్వాజోన్ పరిధిలో ఉన్న వాటికి రూ.6.40 పడుతుంది. అయితే విద్యుత్ వినియోగంలో ట్రూఅప్ చార్జీలు, టీపీఎస్ చార్జీలు, కోల్ వంటి పేరిట యూనిట్ ధర రూ.8 నుంచి రూ.9 వరకు పడుతుంది. చెరువుల వద్ద విద్యుత్ వినియోగించకపోయినా బిల్లులు మాత్రం నెలనెలా చెల్లించాల్సి వస్తుంది. దీంతో ఆక్వా రైతులకు భారంగా మారింది.

ప్రస్తుత రేట్లు

100 కౌంట్	రూ.260
90 కౌంట్	రూ.270
80 కౌంట్	రూ.285
70 కౌంట్	రూ.320
60 కౌంట్	రూ.340
50 కౌంట్	రూ.370
40 కౌంట్	రూ.405
30 కౌంట్	రూ.465
25 కౌంట్	రూ.510
20 కౌంట్	రూ.610

గుత్తాధిపత్యాన్ని నియంత్రించాలి



ఆక్వారంగంలో గుత్తాధిపత్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. రొయ్యల ఎగుమతిదారులు, ఫీడు కంపెనీలు, హేచరీలు, సీడు కంపెనీలు, రొయ్యల కొనుగోలుదారులు, మేత సరఫరాలోను, రొయ్యపిల్ల అమ్మకంలోను కేంద్ర ప్రభుత్వం తగ్గించిన ట్యాక్సులు అమలు చేయడం లేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. విద్యుత్ సబ్సిడీ విషయంలో నిబంధనలు సడలించి ఆక్వాసాగు చేసే అందరికీ విద్యుత్ సబ్సిడీ అందించాలి. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కొనుగోలు విషయంలో పాత విధానాన్ని అమలు చేయాలి.

త్సవటపల్లి నాగభూషణం, రాష్ట్ర ఆక్వాఫెడరేషన్ సలహాదారుడు



గ్రీవెన్స్ అర్జీలపై పర్యవేక్షణ

కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

అమలాపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన అర్జీల పురోగతిపై రాష్ట్రస్థాయిలో మోనటరింగ్ నిర్వహిస్తున్నారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయిలోని ఆడిట్ బృందాలు నేరుగా అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారంపై సంతృప్తి చెందారా లేదా అని అడిగి తెలుసుకుంటున్నారని వివరించారు. ప్రజా ప్రతినిధులకు కూడా ప్రజల గ్రీవెన్స్‌ను రిజిస్టర్ చేయడానికి లాగిన్లు ఇచ్చారన్నారు. వారు కూడా క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించేందుకు ఆన్‌లైన్ రిజిస్టర్‌లో నమోదు చేసుకుంటూ జిల్లా అధికారులను మోనటరింగ్ చేస్తున్నట్టు వివరించారు. అర్జీలను నిర్ణీత వ్యవధిలో పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో ప్రధానంగా పురపాలక, పంచాయతీరాజ్, సర్వే, సెర్ఫ్, రెవెన్యూ, పోలీసు, పౌరసరఫరాలు, ఆరోగ్య శాఖలకు సంబంధించిన అర్జీలు అత్యధికంగా అందుతున్నాయని వివరించారు. సంబంధిత శాఖల అధికారులు వాటి పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. కొందరు అధికారులు అర్జీలను పరిష్కరించేటప్పుడు తప్పుగా ట్యాగింగ్, డిస్పోజల్ ఎండార్స్‌మెంట్ చేస్తున్నారని అటువంటి అధికారులు తప్పిదాలను సరిదిద్దుకోకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ ప్రభుత్వ శాఖకు సంబంధించి జిల్లా, డివిజన్, మండలస్థాయిల్లో గ్రీవెన్స్ నోడల్ అధికారులను నియమించే దిశగా మంగళవారం ఉత్తర్వులు జారీచేసి జిల్లా యంత్రాంగానికి వివరాలు సమర్పించాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇన్‌చార్జి డీఆర్వో మదన్మోహనరావు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఝాన్సీరాణి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి 130 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా, డీపీవో డి.శాంతలక్ష్మి, పంచాయతీరాజ్ డీఈ రామకృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ బి.రాము, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, సీపీవో వెంకటేశ్వర్లు, ఇండస్ట్రీస్ జీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

మార్గశిర మాసంలో పండుగలెన్నో..

ఈ నెల 25 వరకు పెళ్లి ముహూర్తాలు

ప్రత్యేక కథనం..6లో

మూడు వేల ఎకరాల్లో నేలనంటిన వరి



ముమ్మిడివరం: అయినాపురంలో నేలకొరిగిన వరిచేను చూపిస్తున్న రైతు

తడిసి ముద్దయిన వరిపనలు

కొన్నిచోట్ల మోకాల్లోతు నీరు

పల్లపు ప్రాంతాల్లో ఎక్కువ నష్టం

ధాన్యం రంగుమారే ప్రమాదం ఉందని రైతుల ఆందోళన

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ తీరం దాటడంతో సోమవారం వర్షం కొంతమేర తెరిపిచ్చింది. దీంతో ఖరీఫ్ రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. తుఫాన్ కారణంగా శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు కురుస్తున్న వర్షాలతో పలు పల్లపు ప్రాంతాల్లోని వరి నీట మునిగింది. అక్కడక్కడా ముందుగా కోసిన రబీ నారుమడులు కూడా నీట మునిగాయి. మెరక ప్రాంతాల్లో ఉన్న వరి, నారుమడులకు అంతగా ఇబ్బంది లేకపోయినా పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి నారుమడులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పల్లపు ప్రాంతాల్లో వేసిన ధాన్యం రాశులు కొంతమేర దెబ్బతినే అవకాశం ఉంది. వరి యంత్రాలతో కోసిన ధాన్యాన్ని వెంటనే రాశులుగా పోసి టార్పాలిన్లతో కప్పివేశారు. ఆ ధాన్యం రంగుమారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో 1,57,812 ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు కాగా 98,004 ఎకరాల్లో వరి మాసూలు పూర్తి అయింది. ఇంకా 59,808 ఎకరాల్లో వరి చేలల్లో కోతకు సిద్ధంగా ఉంది. కురిసిన వర్షాలు, వీచిన గాలులకు జిల్లాలో 3 వేల ఎకరాల్లో వరి నేలనంటినట్టు వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనాల్లో తేలింది. వర్షాలకు రైతులకు జరిగిన నష్టాన్ని గుర్తించేందుకు వీఆర్వోలు, వీఏవోలు గ్రామాల్లో పర్యటిస్తున్నారు. జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.నందకిశోర్ సోమవారం ముమ్మిడివరం, దొంతికుర్రు గ్రామాల్లో పర్యటించి ముంపు బారిన వరి పొలాలను, వర్షాలకు తడిసిన ధాన్యం రాశిని పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

ఎస్పీ కార్యాలయ గ్రీవెన్స్‌కు 16 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ బి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు 16 అర్జీలను అందించారు. సివిల్ తగాదాలతో పాటు వ్యక్తిగత సమస్యలు, కేసులకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులు అందాయని వీటి పరిష్కారానికి కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పీ కృష్ణారావు తెలిపారు.

పోలి పాడ్యమి పూజలు



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో పోలి పాడ్యమి పూజలు ఘనంగా జరిగాయి. మహిళలు కార్తీక దీపాలు వదిలి నమస్కరించారు..

● ద్రాక్షారామ



అన్నదాతలూ.. ఇలా చేయండి



రాశులను పరిశీలిస్తున్న ప్రధాన శాస్త్రవేత్త నందకిశోర్

ప్రధాన శాస్త్రవేత్త ఎం.నందకిశోర్ సూచనలు

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురిసిన వర్షాల నుంచి పంట నష్టాన్ని అధిగమించేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక సలహా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త, కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.నందకిశోర్ సూచించారు. సకాలంలో రైతులు చర్యలు చేపట్టడం వల్ల నష్టాన్ని కొంత వరకు తగ్గించుకోగలరన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న వరిని వర్షాలు పూర్తయ్యేవరకు కోతలు కోయకుండా వాయిదా వేసుకోవాలన్నారు. కోసిన వరి ఆరని పనలను తుఫాను వాతావరణ నేపథ్యంలో కుప్పలుగా వేసేటప్పుటు ఎకరాకు 25 కిలోల ఉప్పును పనలపై చల్లుకుంటూ కుప్పలు వేసుకోవాలన్నారు. కోతకోసి పొలాల్లో ఉన్న వరి పనలు తడిసినట్టయితే గింజలు మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పనలపై పిచికారీ చేయాలని, పొలంలో నీరు నిలిచి ఉన్నట్టయితే పనలను గట్టుపైకి తీసుకువచ్చి ఉప్పు ద్రావణాన్ని చల్లుకోవాలన్నారు. వర్షాలు తగ్గి ఎండలు రాగానే వరి పనలను ఆరబెట్టి నూర్చుకోవాలన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని వర్షానికి తడవకుండా భద్రపరుచుకోవాలని, రెండు మూడు రోజులు ఎండబెట్టడానికి వీలులేకపోతే గింజలు మొలకెత్తడమే కాకుండా రంగులు మారే ప్రమాదం ఉందన్నారు. నష్టాన్ని నివారించేందుకు ఒక క్వింటా ధాన్యానికి కిలో ఉప్పు, 20 కిలోల పొడి ఊకను కలిపి ధాన్యం పోగుపెట్టడం వల్ల గింజలు మొలకెత్తకుండా, పాడవకుండా నివారించుకోవచ్చునన్నారు. ఎండ వచ్చిన తర్వాత ఆ ధాన్యాన్ని ఎండబెట్టి నిల్వ చేసుకోవాలన్నారు. రంగు మారిన, తడిసిన ధాన్యం ఉప్పుడు బియ్యానికి అందుకోవడం వల్ల కొంత వరకు నష్టాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. గింజ గట్టిపడే దశ నుంచి వరి కోత దశలో చేను పడిపోకుండా ఉండి నిద్రావస్థ కలిగిన రకాలకు నష్టం తక్కువగా ఉంటుందన్నారు. నిద్రావస్థ లేనటువంటి బీపీటీ 5204 వంటి రకాలు నీట మునిగితే గింజలు మొలకెత్తి ఎక్కువ నష్టం కలుగుతుందన్నారు. నిద్రావస్థలో ఉన్న రకాలు కూడా చేలు పడి ఎక్కువరోజులు నీట మునిగి ఉంటే మొలక వచ్చే అవకాశం ఉందని వాటి నివారణకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని చేనుపై పిచికారీ చేసుకోవాలన్నారు. గింజ గట్టిపడే దశలో వరి వెన్ను బరువు వల్ల మొక్కలు కొద్దిపాటి గాలి, వర్షాలకే నేలకొరుగుతాయని దీనివల్ల గింజలు సరిగా తోడుకోక పాలు గింజలుగా ఏర్పడి దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. అటువంటి వాటి వల్ల ధాన్యం రంగుమారి, మిల్లింగ్ సమయంలో విరిగిపోయి బియ్యంపై మచ్చలు వచ్చే అవకాశం ఉందన్నారు. పడిపోయిన వరిచేనును యంత్రాలతో కోయడానికి ఎక్కువ సమయం పడుతుందని, దీనివల్ల ఖర్చు పెరుగుతుందన్నారు. ఈ నష్టాన్ని నివారించేందుకు వరి దుబ్బులను పైకి లేపి నిలబెట్టి కట్టలుగా కట్టే చర్యలు చేపట్టాలన్నారు. దాళ్వా నారుమడి దశలో ఉన్న వరిపంటకు సంబంధించి విత్తనం చల్లి రెండు, మూడు రోజులైతే మొలక శాతం తగ్గుతుందని, వీలైనంత త్వరలో నీటిని పూర్తిగా బయటికి తీసివేయడం వల్ల విత్తనం కోర గాలి తగిలి నష్టం జరగకుండా ఉంటుందన్నారు. నీరు బయటికి తీయడానికి వీలులేకపోతే మొలక దెబ్బతిని తిరిగి మళ్లీ విత్తనం చల్లుకోవాల్సి ఉంటుందన్నారు. విత్తనం చల్లి ఏడు నుంచి 30 రోజుల మధ్యలో నారుమడి ఐదు రోజుల కన్నా ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. ఐదు రోజుల లోపు నీటిని పూర్తిగా బయటకు తీసివేసి గాలి తగిలేలా చూసుకోవాలన్నారు. నీటిని తీసివేసిన తర్వాత ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, ఒక కిలో పొటాష్ వేసుకోవడం వల్ల నారు దృఢంగా పెరుగుతుందన్నారు. వర్షాల వల్ల నారుమడుల దశలో పంట తెగుళ్ల బారిన పడకుండా నీటిని పూర్తిగా తీసివేసి మొక్క నిలదొక్కుకున్న తర్వాత లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్డిజం, రెండు గ్రాముల కార్బన్డిజంతో పాటు మ్యాంగో జెబ్ కలిపి మిశ్రమాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. పొలంలో నిలిచిన నీటిని మురుగు కాల్వల ద్వారా బయటికి వెళ్లేందుకు బాటలు వేసుకోవాలన్నారు.

వర్షపాతం వివరాలు

అమలాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో సోమవారం జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. జిల్లాలో సగటున 14.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా రామచంద్రపురంలో అత్యధికంగా 36, రాజోలులో అత్యల్పంగా 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆత్రేయపురంలో 9.6, మండపేట 11.8, రాయవరం 35.2, ఆలమూరు 10, రావులపాలెం 4.8, కొత్తపేట 12, కపిలేశ్వరపురం 11.6, కె.గంగవరం 17.4, ఐ.పోలవరం 31.4, ముమ్మిడివరం 15.6, అయినవిల్లి 11.8, పి.గన్నవరం 10.4, అంబాజీపేట 4.6, మామిడికుదురు 9, మలికిపురం 9.6, సఖినేటిపల్లి 6, అల్లవరం 17.4, అమలాపురం 11.4, ఉప్పలగుప్తం 17.8, కాట్రేనికోన మండలంలో 12.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కార్తీకానికి వీడ్కోలు


పాడ్యమి దీపాల వెలుగులో రాజమహేంద్రవరం గోదావరి తీరం

- భక్తి శ్రద్ధలతో పోలి పాడ్యమి

అంతా శివనామస్మరణే. కార్తీకానికి వీడ్కోలు పలుకుతూ భక్తులు పోలి స్వర్గం (పోలి పాడ్యమి) సందర్భంగా అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి నదుల్లో వదిలారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి పాడ్యమి దీపాలు వెలిగించి పూజలు చేశారు.


పిఠాపురం పాదగయ పుష్కరిణిలో పాడ్యమి దీపాలు వదులుతున్న భక్తులు


కార్తీక మాసం ముగింపు వేళ దక్షిణ కాశీగా పేర్గాంచిన కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వాములు


పంచారామ క్షేత్రం సామర్లకోటలో వెండి జటాఝూటి అలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి


రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద పుణ్యస్నానాలు చేసి దీపాలు వదులుతున్న భక్తులు


కాకినాడ జిల్లా కోటనందూరు మండలం కాకరాపల్లిలో మహిళల పూజలు


జగ్గంపేటలో పాడ్యమి దీపాలు వెలిగిస్తున్న మహిళ


రాజమహేంద్రవరంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు


బ్రాహ్మణునికి దీపదానం (రాజమహేంద్రవరంలో)


పెళ్లి మండపాలు రెడీ


ఎ.వేమవరంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

మాసానాం మార్గశీర్షోహం

మార్గశిర మాసంలో పండుగలెన్నో.. డిసెంబరు 25 వరకు పెళ్లి సందడి

అమలాపురం రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ శంభో శివశంకరా.. అంటూ తన్మయత్వంతో భక్తుల శివనామస్మరణలతో ఈ ఏడాది కార్తీకమాసం ముగిసింది. కార్తీకం అలా వెళ్లగానే శివకేశవులకు బేధం లేదంటూ హరినామస్మరణలతో ఈనెల 2 నుంచి మార్గశిరమాసం ప్రారంభమైంది. మాసానాం మార్గశీర్షోహం అని గీతాచార్యుడు శ్రీకృష్ణభగవానుడు చెప్పాడు. మాసాల్లో మార్గశీర్షం తానేనని శ్రీకృష్ణ భగవానుడు ప్రకటించాడు. మార్గశిర మాసంలో హరినామాన్ని నోరారా పలికితే సకల శుభాలు కలుగుతాయని గోదాదేవి తిరుప్పావై ప్రబంధంలో పలుమార్లు పేర్కొంది. కలియుగంలో హరినామస్మరణను మించినది లేదని పురాణాలు చెబుతున్నాయి. శ్రీవైష్ణవులకు పరమ పవిత్రమైన ఈ మాసంలో శ్రీరంగనాథుడిని ప్రసన్నం చేసుకునేందుకు గోదాదేవి పాడిన తిరుప్పావై పాశురాలకు ఎనలేని ప్రాధాన్యత ఉంది. అంతేకాకుండా ఈ మాసంలోనే సంక్రాంతి పండుగ సందడి కూడా ప్రారంభమవుతుంది. సంక్రాంతి నెల రోజుల పండుగతో ఇళ్లు రంగురంగుల రంగవల్లులతో సంక్రాంతి శోభను సంతరించుకుంటాయి. అటువంటి మార్గశిర మాసంలో వచ్చే పండుగలెన్నో. ఈ నెల 2న మార్గశిర మాసం ప్రారంభం కాగా 16న ధనుర్మాసం ప్రారంభమవుతుంది. డిసెంబరు 7న సుబ్రహ్మణ్య షష్ఠి జరుపుకుంటారు. ఆ రోజున జరుపుకునే కార్తికేయ పూజకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 11న భగవద్గీత ఆవిర్భవించిన గీతాజయంతిని జరుపుకుంటారు. 13న హనుమద్వ్రతం జరుపుకుంటారు. ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహిస్తారు. అంతే కాకుండా ప్రదోష వ్రతం పేరున శివుడిని పూజిస్తారు. 15న మార్గశిర పూర్ణిమను పురస్కరించుకుని దత్తాత్రేయ జయంతిని నిర్వహిస్తారు. 16న సంక్రాంతి పండుగకు నెలపట్టుట. ధనుర్మాసం ప్రారంభం. 18న సంకష్టహర చతుర్థి రోజున వినాయకుని పూజలు జరుపుతారు. 22న కాలభైరవాష్టమి నిర్వహిస్తారు. కాలభైరవుడిని పూజించడం ద్వారా సకల కష్టాలను, దోషాలను అధిగమించవచ్చు.

4 నుంచి 25 వరకు ముహూర్తాలు



మార్గశిర మాసంలో జరుపుకునే పండుగలకు కొదవేలేదు. దానికి తోడు ఈ మాసంలో వివాహాది శుభ ముహూర్తాలు ఎక్కువే. ఈ నెల 4 నుంచి 25 వరకు పెళ్లి ముహూర్తాలున్నాయి. దీంతో ఏ వీధిలో చూసినా పెళ్లి సందడే కనిపించనుంది. ఈనెల 4,5,6,7, 10,11,20,25 తేదీల్లో పెళ్లి ముహూర్తాలు అధికంగా ఉన్నాయి. ఈ మాసంలో శంకుస్థాపనలు చేయరు. ఇక గృహప్రవేశాలకు కూడా ముహూర్తాలు అధికంగానే ఉన్నాయి. ఈనెల 4,6,7,9,10,17,22,24 తేదీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు ఉన్నాయి.

- కాలెపు భీమేశ్వరరావు సిద్ధాంతి, పంచాంగకర్త బండారులంక

ఆయనో అర్చకుడు.. గోసేవకుడు


ముమ్మిడివరంలోని ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న గిరిశర్మ


గోవులకు దాణా పెడుతున్న గిరిశర్మ

ముమ్మిడివరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆయనో అర్చకుడు.. ఆదాయం అంతంతమాత్రమే. అయినా తనకు వచ్చే ఆదాయంలో సగం గోవుల సంరక్షణకు ఖర్చు చేస్తుంటారు. దేవుడితోపాటు గోవులకు సేవచేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ముమ్మిడివరం శ్రీలక్ష్మీగణపతి ఆలయ అర్చకుడిగా పని చేస్తున్న వెలువలపల్లి గిరిశర్మ స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ. పద్దెనిమిదేళ్ల కిందట ముమ్మిడివరం వచ్చారు. భార్య రమాదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఉండడానికి సొంత ఇల్లు లేకపోవడంతో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. వర్తక సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో అర్చకత్వం చేస్తున్నారు. నెల జీతం పది వేలలోపే. ఇదికాక భక్తులు ఇచ్చే ఐదో, పదో దక్షిణతోనే జీవనం. దీంతోపాటు హోమాలు, పెళ్లిళ్ల వంటి కార్యక్రమాలకు వెళతారు. కానీ ఈయనకు వచ్చే ఆదాయంలో రోజుకు 15 నుంచి 20 వీధి పశువులకు (ఆవులు, ఆబోతులు) ఉదయం, సాయంత్రం దాణా పెడుతుంటారు. అంటే రోజూ రూ.200 నుంచి రూ.250 ఖర్చు అవుతుంది. ఏదైనా పశువుకు అనారోగ్యానికి గురైతే వైద్య సేవలు అందిస్తుంటారు. వాటికి రెండు పూటలా దాణా పెట్టి నిమరందే తనకు నిద్ర పట్టదని గిరిశర్మ చెబుతారు. ఇలా గిరిశర్మ గోసేవతో తరిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు.


గండేపల్లి మండలం నీలాద్రిరావుపేటలో రంగురంగు పూలతో చూపరులను ఆకర్షిస్తున్న నర్సరీ

ప్రత్తిపాడు-వెల్దుర్తి రహదారిలో నర్సరీలో మొక్కల పెంపకం

నర్సరీల మెట్ట.. ఎట్టెట్టా!


మొక్కలతో పాటు పూల కుండీల తయారీ

- మెట్ట ప్రాంతంలో నర్సరీల విస్తరణ
- గండేపల్లి టు తుని జాతీయ రహదారి పక్కన ఏర్పాటు
- చూపరులను ఆకట్టుకుంటున్న వివిధ రకాల మొక్కలు
- ప్రత్తిపాడులోను రెండు చోట్ల పెద్ద నర్సరీలు
- మొక్కల పెంపకంతో స్థానికులకు ఉపాధి
- శుభకార్యాలకు పూల అమ్మకాలు కూడా ఇక్కడే

గండేపల్లి/ప్రత్తిపాడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మెట్టలో నర్సరీలా.. ఆశ్చర్యంగా ఉంది కదూ.. అసలు నర్సరీలు పేరు చెప్తే ఠక్కున గుర్తొచ్చేది కడియపులంక పేరే.. ఆ ప్రాంతంలోనే ఎక్కువగా నర్సరీలుంటాయి. పూలు, డెకరేషన్, ఇతరత్రా ఏమొక్కలు కావాలన్నా గోదావరి జిల్లాల్లో ఎవరైనా అక్కడికి వెళ్లి రావాల్సిందే. కానీ ఈ రెండు, మూడేళ్లలో మెట్ట ప్రాంతంలోనూ నర్సరీలు విస్తరిస్తున్నాయి. దీంతో ఇక్కడే రకరకాల పండ్ల, పుష్పాల మొక్కలు లభ్యమవుతున్నాయి. కాకినాడ జిల్లా గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాల్లో నర్సరీలు రెండు మూడేళ్లుగా అభివృద్ధి చెందుతున్నాయి. 16వ నెంబరు జాతీయ రహదారి పక్కనే గండేపల్లి మొదలుకొని తుని వరకు విస్తరించాయి. ప్రారంభంలో ఒక్కొక్కటిగా మొదలైన నర్సరీలు ప్రస్తుతం 15 వరకు ఏర్పాటయ్యాయి. మెట్ట ప్రాంతమైన గండేపల్లి మండలంలోని మురారి, గండేపల్లి, నీలాద్రిరావుపేట, జగ్గంపేట మండలంలోని కాట్రావులపల్లిలో రెండుచోట్ల, కిర్లంపూడి, ప్రత్తిపాడు, తుని మండలాల పరిధిలోను కొన్నిచోట్ల నర్సరీలు ఏర్పాటుచేశారు. ప్రత్తిపాడు మండలం బవురువాకలోను 50 ఎకరాల్లో ఒక నర్సరీ ఉంది. ఇదే మండలంలోని ఒమ్మంగిలోను 30 ఎకరాల్లో ఓ నర్సరీని విస్తరించారు. ఇక ప్రత్తిపాడు మండలం ధర్మవరం నుంచి పిఠాపురం వెళ్లే రహదారిలోని వెల్దుర్తిలోను ఓ నర్సరీ ఉంది. గండేపల్లి-తుని మధ్య హైవే పక్కనున్న నర్సరీల్లో పూలు, వివాహాలకు ఉపయోగించే పూల మొక్కలు, డెకరేషన్ సామగ్రి లభ్యమవుతోంది. ఈ నర్సరీల్లో రంగు రంగుల పూల మొక్కలు కనిపించడంతో హైవేపై వెళ్లేవారి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. వాటిని చూసి ఆగి చాలామంది కొనుగోలు చేస్తున్నారు. కడియపులంకను తలపించేలా మెట్ట ప్రాంతంలో నర్సరీల ఏర్పాటుపై పలువురు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల చాలా మందికి ఉపాధి కలుగుతోంది. ఆయా గ్రామాల్లో ఉండే మహిళలు నర్సరీల్లో మొక్కల పెంపకం, వాటి నిర్వహణ పనులు చూస్తున్నారు. దీంతో వారికి నిత్యం పని దొరుకుతోంది. ఇలా ఈ పనులపై ఆధారపడి 200 మందికిపైగా మహిళలు, యువత ఉపాధి పొందుతున్నారు. కొందరు కడియపులంక నుంచి ఇక్కడకు వచ్చి ఈ నర్సరీలను నిర్వహిస్తున్నారు. స్థానికులు కూడా కొందరు మొక్కల పెంపకంపై ఆసక్తితో నర్సరీలు నడుపుతున్నారు. దీంతో మొక్కలు కావాలంటే కడియపులంకే కాదు.. ఇక్కడే కొనొచ్చని మెట్టవాసులు చెబుతున్నారు.


నర్సరీ పనిలో..

సత్యదేవునికి...

కాసులు కురిపించిన కార్తీకమాసం

అన్ని విభాగాల ద్వారా రూ.21.13 కోట్ల ఆదాయం


స్వామివారి ఖజానాకు చేరిన నోట్ల కట్టలు


స్వామి, అమ్మవార్లు

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈ ఏడాది కార్తీకమాసం కాసులు కురిపించింది. ఇప్పటికే వ్రతాల నిర్వహణలో ఆల్ టైం రికార్డు నెలకొల్పగా తాజాగా సోమవారం హుండీల లెక్కింపుతో కార్తీక మాస ఆదాయాన్ని అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాల ద్వారా రూ.21,13,82,068 ఆదాయం లభించింది. గతేడాదితో పోలిస్తే రూ.45 లక్షల ఆదాయం అధికంగా వచ్చింది. ఈ ఆదాయం రికార్డుగా నిలిచింది. ప్రధానంగా వ్రతం టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.8.33 కోట్లు, ప్రసాదం విక్రయాల ద్వారా రూ.4.86 కోట్లు, హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3.04 కోట్లు, సత్రం గదుల అద్దెల ద్వారా రూ.1.43 కోట్లు స్వామివారికి సమకూరింది. గతేడాది కంటే అన్ని విభాగాల ద్వారా ఆదాయం పెరగగా లీజులు విభాగం వసూళ్లు, ఇతర మిస్‌లీనియస్ ఆదాయపరంగా గతేడాదితో పోలిస్తే రూ.2.64 కోట్లు తగ్గింది. కార్తీకమాసంలో సుమారు కోటి మంది భక్తులు సత్యదేవుని దర్శించుకున్నారు.

హుండీల ఆదాయం రూ.1.30 కోట్లు

సత్యదేవుని సన్నిధిలో భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించారు. రూ.1,30,30,404 నగదు, 52.500 గ్రాముల బంగారం, 1125 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటు పలు దేశాల కరెన్సీ లభించింది. 13 రోజులకు ఈ ఆదాయం సమకూరింది. సరాసరిన రోజుకు రూ.10.02 లక్షలు చొప్పున భక్తులు హుండీల్లో కానుకల రూపంలో సమర్పించారు. సిబ్బంది లెక్కించగా చైర్మన్ రోహిత్, ఈవో త్రినాథరావు పర్యవేక్షించారు.

గతేడాది కార్తీకమాస ఆదాయం, ఈ ఏడాది కార్తీకమాసం ప్రధాన విభాగాల ఆదాయం ఈ పట్టికలో చూడవచ్చు.

విభాగము	2023(రూ.లో)	2024 (రూ.లో)
వ్రతం టిక్కెట్లు విక్రయాలు	7,03 కోట్లు	8.33 కోట్లు
ప్రసాదం విక్రయాలు	4.38 కోట్లు	4.86 కోట్లు
హుండీలలో వచ్చిన కానుకలు	2.81 కోట్లు	3.04 కోట్లు
సత్రం గదుల అద్దెల ద్వారా	89.98 లక్షలు	1.43 కోట్లు
కల్యాణ మండపాలు	5.47 లక్షలు	8.41 లక్షలు
ప్రత్యేక దర్శనాలు	67.01 లక్షలు	85.82 లక్షలు
ఏసీ వ్రతాల నిర్వహణ	47.60 లక్షలు	60.45 లక్షలు
రవాణా విభాగం	27.03 లక్షలు	40.81 లక్షలు
లైసెన్స్ ఇతర ఆదాయాలు	3.73 కోట్లు	1.09 కోట్లు


హుండీలలో కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

భీమేశ్వరాలయంలో ప్రముఖుల పూజలు


సీనియర్ ఐఏఎస్ అధికారి ప్రద్యుమ్న దంపతులు పూజలు


వేదాశీర్వచనం పొందుతున్న అంతర్జాతీయ స్విమ్మర్ శ్యామల దంపతులు

సామర్లకోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పలువురు ప్రముఖులు పూజలు నిర్వహించారు. సీనియర్ ఐఏఎస్ అధికారి, సీఎం.పేషీ అధికారి ప్రద్యుమ్న సతీసమేతంగా భీమేశ్వరాలయం చేరుకుని స్వామి,అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో నీలకంఠం ఆధ్వర్యంలో పండితులు సాదరంగా స్వాగతం పలికారు. నంది మండపం వద్ద వేదాశీర్వచనంతో పాటు ప్రసాదాలు... స్వామి,అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. అలాగే శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ భీమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహి ంచారు. అంతర్జాతీయ స్విమ్మర్ అవార్డు గ్రహీత గోలి శ్యామల తన భర్త గోలి మోహన్‌తో కలిసి భీమేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భారీ లడ్డూలు అందజేత

భీమేశ్వర స్వామికి ఝటా జుటం అలంకరణ పురస్కరించుకుని సామర్లకోట లయన్స్ క్లబ్ ప్రతినిధి అమలకంటి శ్రీనివాసరావు సౌజన్యంతో ఒక్కొక్కటి 30 కిలోల పరిమాణంలో గల 3 భారీ లడ్డూలను ఆలయంలో అలంకరణ నిమిత్తం అందజేశారు. గత 15ఏళ్లుగా ఇస్తున్నరీతిలోనే ఈ సారి కూడా లడ్డూలను అందజేశారు. పండితుల వేదమంత్రోచ్ఛారణల మధ్య లడ్డూలను స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌ల ఎదుట అలంకరించారు. మంగరాజు, బుల్లియ్య, మురళీ పాల్గొన్నారు. స్వామివారికి వెండి ఝుటా జుటం అలంకరణ సందర్భంగా దాతల సౌజన్యంతో ఆలయ ఆవరణను వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. పలు ప్రధాన మండపాల వద్ద పండ్లతో అలంకరించారు. పూలతో ఓం నమఃశివాయ పేరిట అక్షర క్రమాన్ని ఆలయం నలువైపులా అలంకరించారు.


భీమేశ్వరునికి అందజేసిన భారీ లడ్డూలు

నేడు ఏపీటీలో పాలీటెక్ ఫెస్ట్ ప్రారంభం

కాకినాడరూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన ప్రాంతీయస్థాయి పాలీటెక్ ఫెస్ట్ మంగళవారం ప్రారంభంకానుందని ప్రిన్సిపాల్ ఎస్.జనార్ధనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రదర్శనకు జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటిక్నిక్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 117 ప్రాజెక్టులను ప్రదర్శించనున్నారని, సుమారు 2000 మంది టెక్‌ఫెస్ట్‌లో పాల్గొననున్నారన్నారు. రెండు రోజుల పాటూ జరిగే ఈ ప్రదర్శనలో అత్యుత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.25000, రెండవ బహుమతి రూ.10,000 బహుకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రాంతీయ సాంకేతిక విద్యాశాఖాధికారి జె.సత్యనారాయణ పాల్గొంటారని ఆయన చెప్పారు.

వీరేశ్వరస్వామి ఆదాయం రూ.50.43లక్షలు

ఐ.పోలవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేతవీరేశ్వరస్వామి కార్తీక మాస ఆదాయం రూ.50,43,680 వచ్చినట్టు ఆలయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు. గతం కంటే ఆదాయం గణనీయంగా పెరిగిందన్నారు. నిత్యకల్యాణం, పంచామృతాభిషేకాలు, లఘున్యాస అభిషేకాలు, ఇతర సేవల రూపంలో రూ.41,46,452, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,45,985, అన్నదాన ట్రస్టు ద్వారా రూ.7,51,043 సమకూరినట్టు ఆయన వివరించారు. వీరేశ్వరస్వామి ఆలయం టెంపుల్ టూరిజం ప్యాకేజీలో ఉన్నందున రాష్ట్ర వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారన్నారు. ఆలయ ప్రాశస్త్యం పెరగడంతో ఆలయ గ్రేడ్ కూడా 6-ఎ నుంచి సహాయ కమిషనర్ హోదాకు చేరుకుందన్నారు. కార్తీక మాసంలో అన్నివిధాలా సహకరించిన అన్ని శాఖల ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

కుక్కుటేశునికి ప్రత్యేక పూజలు

పిఠాపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలిపాడ్యమి సందర్భంగా పట్టణంలోని పాదగయ క్షేత్రంలో కొలువయి ఉన్న స్వయంభూ కుక్కుటేశ్వరస్వామికి సోమవారం రాత్రి ప్రత్యేక పూజలు జరిగాయి. విశేష పూజలు అనంతరం స్వామిని ఝటా జుటంతో అలంకరించారు. స్వామిని భక్తులు దర్శించుకున్నారు.


పాదగయ క్షేత్రంలో ఝటా జుటం అలంకరణలో కుక్కుటేశ్వరస్వామి

48 గంటలపాటు మద్యం బంద్

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నిర్ణయం
- ఉభయగోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు నిబంధన వర్తింపు
- కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో 48గంటలపాటు మద్యం దుకాణాలను బంద్ చేస్తున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల్లో పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలకు ఈ నిబంధన వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి ఈనెల 5వతేదీ సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు సమీపంలోని మద్యం దుకాణాలను ఏపీ ప్రభుత్వ చీఫ్ ఎలక్టోరల్ అధికారి ఆదేశాల మేరకు బంద్ చేస్తున్నామన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలనే లక్ష్యంతో మద్యం దుకాణాలను మూసివేయాలని ఆదేశించామని ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టరేట్ (కాకినాడ), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5న జిల్లాలో జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ప్రశాంతమైన వాతావరణంలో సమర్థంగా నిర్వహించాలని తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, డీఆర్వో జె.వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో పోలింగ్ అధికారులు, సిబ్బందికి సోమవారం ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో 16,737 మంది ఓటర్లు ఉండగా 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కాకినాడ జిల్లాలో ప్రత్యేకంగా 3418 మంది ఓటర్లు ఉండగా వారి కోసం 22 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ఈనెల 5న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుందన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను సురక్షితంగా కాకినాడ జేఎన్‌టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరుస్తామని ఆయన తెలిపారు. తొలుత పోలింగ్ ప్రక్రియపై పీవోలు, ఏపీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లు, సెక్టార్ అధికారులకు అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో విధులు, పోలింగ్ ప్రక్రియ, పోలింగ్ మెటీరియల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, పీవో డైరీ, మైక్రో అబ్జర్వర్ల విధులు, ఫర్నీచర్, విద్యుత్తు, పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానాలపై సిబ్బందితో చర్చించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

ప్రాచీన ఆలయాల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే పూజలు


బిక్కవోలులో ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరిస్తున్న షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

బిక్కవోలు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన ఆలయాలను సోమవారం శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ దర్శించారు. లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోలింగేశ్వర, కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామివార్లను దర్శించి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేను షష్ఠి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో లక్ష్మీగణపతి ఆలయ కమిటీ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి, కమిటీ సభ్యులు గొర్రెల త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీనివాస్, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నందిపాటి కిషోర్‌కుమార్‌రెడ్డి, రాజారెడ్డి ఉన్నారు.

కుమార్తెను చూసేందుకు వెళుతూ...

వ్యాన్ ఢీకొనడంతో తండ్రి మరణం



వ్యాన్ చక్రాల కిందకి వెళ్లిపోయిన యాక్టివా బండి

సర్పవరం జంక్షన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు వెళుతూ...మార్గ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం గొడారిగుంట వీఎస్ లక్ష్మీకాలేజీ సమీపంలో జరిగింది. కాకినాడ రూరల్ సూర్యారావుపేటకు చెందిన మత్స్యకారుడు దాసరి ధనకొండ (45)కు భార్య సరస్వతి, అబ్బాయి ఆకాశ్, కుమార్తె మానస ఉన్నారు. అతడు స్థానిక ఫిషింగ్ హార్బర్‌లో మత్స్యకారులు పట్టిన చేపలకు వేలంపాట పాడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమార్తెను ప్రసవం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చేర్పించగా ఇటీవల శస్త్రచికిత్స చేసి ప్రసవం చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతోన్న కుమార్తెను పరామర్శించేందుకు సోమవారం సాయంత్రం యాక్టివా బండిపై బయలుదేరి వలసపాకల సెంటర్ నుంచి గొడారిగుంట మీదుగా ఆస్పత్రికి పయనమయ్యాడు. ఈ క్రమంలో బొందగుంటలో వీఎస్ లక్ష్మీకాలేజీ దాటిన తర్వాత శశికాంత్‌నగర్ రోడ్డు నాలుగురోడ్ల సెంటర్‌లో వ్యాన్ ఢీకొనడంతో బైక్ వ్యాన్ కిందకి వెళ్లిపోగా ధనకొండ తలకు తీవ్ర గాయంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిన అతడిని స్థానికులు చికిత్స కోసం సమీపంలోని లక్ష్మీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ ఇంటి నుంచి బైక్‌పై వెళ్లిన కొద్దిసేపటికే భర్త మరణవార్త విన్న భార్య కుప్పకూలిపోయింది. పొద్దుపోయింది, ఈ రోజు వద్దు రేపు వెళ్లమని చెప్పినా వినకుండా ఈ రోజే కుమార్తెను చూసి వచ్చేస్తానంటూ వెళ్లిన భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందుతాడని కలలో కూడా అనుకోలేదని కన్నీరుమున్నీరుగా విలపించిన తీరు చూపరులను కంటతడి పెట్టించింది. ప్రమాదసమాచారం తెలిసిన వెంటనే సర్పవరం సీఐ బి పెద్దిరాజు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.


మరణించిన ధనకొండ (ఫైల్)

వ్యక్తి అనుమానాస్పద మృతి

హత్యగా స్థానికుల వెల్లడి
పోలీసుల దర్యాప్తు


దానయ్య మృతదేహం

కాకినాడ క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో హత్యకు గురైన సంఘటన సోమవారం కాకినాడలో జరిగింది. అయితే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ పాత బస్టాండ్ సెంటర్ సమీపంలోని టీబీ ఆసుపత్రి వెనుక భాగంలోని ధనమ్మగుడి వీధికి చెందిన బట్టు దానయ్య అలియాస్ దాలి (35) గతంలో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసేవాడు. అయితే అతడు అప్పటికే పాత నేరస్తుడు. పలు కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు. ఏ పనికి వెళ్లకుండా తాగి జులాయిగా తిరిగేశాడు. అతడికి పెళ్లి కాలేదు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారు జామున సెంట్రల్ డ్రగ్స్ స్టోర్స్ పక్క సందులోని సిమెంట్ రోడ్డుపై దానయ్య రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. అది గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని దానయ్య మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురికి తరలించారు. అయితే ముగ్గురు అగంతకులు రాడ్‌లతో దానయ్యను కొట్టి చంపినట్టు స్థానికులు చెబుతున్నారు. సీసీకెమెరాల పరిశీలనలో కూడా ఇదే విషయం వెల్లడైనట్టు తెలుస్తుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుబాయ్ నుంచి స్వగ్రామానికి రమేష్ మృతదేహం


పేరవరంలో రమేష్ మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పది రోజుల క్రితం దుబాయ్‌లో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన అంగర రమేష్(35) మృతదేహం సోమవారం ఉదయం స్వగ్రామం చేరుకుంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పేరవరం గ్రామానికి చెందిన రమేష్ ఉపాధి కోసం దుబాయ్‌లోని డేరా ప్రాంతంలోని ఓ ప్రవేట్ కంపెనీలో పనిచేసేవాడు. గత నెల 15న అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. దుబాయ్ నుంచి మృతదేహాన్ని స్వగ్రామం రప్పించడం కోసం మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు ప్రయత్నాలు సాగించడంతో దుబాయ్ నుంచి విమానంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు రమేష్ మృతదేహాన్ని తీసుకువచ్చారు. సోమవారం కుటుంబ సభ్యులు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి పేరవరం స్వగ్రామానికి తీసుకువచ్చారు. బంధుమిత్రులు రమేష్ మృతదేహం వద్ద బోరున విలపించారు. భార్య కవిత, ఇద్దరు కుమారులు మాకు దిక్కెవ్వరంటూ రోదించారు. అనంతరం స్థానిక శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

టేబుల్ టెన్నిస్ పోటీల్లో...

జేఎన్టీయూకే జట్టుకు ప్రథమస్థానం


టేబుల్ టెన్నిస్ జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మోహన్‌రావు

జేఎన్టీయూకే, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన విశ్వవిద్యాలయ అంతర కళాశాలల పురుషుల టేబుల్ టెన్నిస్ పోటీల్లో జేఎన్టీయూకే కళాశాల జట్టు ప్రథమస్థానంలో నిలిచినట్టు వర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. అంతేకాకుండా రెండు యూనివర్శిటీల సెలక్షన్‌లను కూడా సాధించారన్నారు. ఈ జట్టు ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకూ తమిళనాడులోని వెల్లూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్)లో జరగనున్న యూనివర్శిటీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ప్రతిభ కనబరచి ప్రథమస్థానంలో నిలిచిన టీటీ జట్టు, శిక్షణ నిచ్చిన పీడీలను యూసీఈకే ప్రిన్సిపాల్ ఎస్.మోహన్‌రావు, శ్యామ్‌కుమార్ అభినందించారు.

గెద్దాడలో ఓఎన్జీసీ పైపులైను స్వల్ప లీకేజీ

మరమ్మతులు నిర్వహించిన అధికారులు


పైపులైనుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గెద్దాడ-వేగివారిపాలెం సరిహద్దులో ఓఎన్జీసీకి చెందిన పైపులైను స్వల్పంగా లీకైంది. లీకేజీని గుర్తించిన స్థానికులు ఓఎన్జీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని పైపులైను ద్వారా గ్యాస్ సరఫరాను నిలుపుదలచేసి మరమ్మతు చర్యలు చేపట్టారు. తాటిపాక స్ట్రక్చర్‌లోని తాటిపాక 6వ బావి నుంచి పైపులైను ద్వారా నగరం జీసీఎస్‌కు గ్యాస్ సరఫరా అవుతుంది. పైపులైనుకు లీకేజీ ఏర్పడిన పైపును సుమారు 10నుంచి 12అడుగుల మేర తొలగించి కొత్త పైపును ఏర్పాటు చేశారు. ఈ బావి నుంచి ఉత్పత్తి అవుతున్న సహజవాయువు హెచ్చుతగ్గుల్లో ఉండడం వల్ల ఇటీవల డ్రిల్లింగ్ నిర్వహించారు. తరువాత ఈ బావి నుంచి గ్యాస్ ఉత్పత్తి పెరిగిందని సంబంధిత అధికారులు తెలియచేశారు. లీకేజీ అయిన పైపులైనుకు మరమ్మతులు నిర్వహించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్ల రికవరీ సులభం

తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ


ఫిర్యాదుదారుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

రాజమహేంద్రవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ల రికవరీ సులభం అవుతోందని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ తెలిపారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న/దొంగతనానికి గురైన సందర్భాల్లో వెంటనే సీఈఐఆర్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో 450 సెల్‌ఫోన్లను రికవరీ చేసి ఫిర్యాదుదారులకు అందజేశారు. చాట్‌బాట్/ సీఈఐఆర్ ద్వారా ఇప్పటివరకూ 1843 సెల్ ఫోన్లు రికవరీ చేశామన్నారు. సెల్ ఫోన్లు దొరికినా, బిల్లుల లేని ఫోన్లను దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కి అందజేయాలన్నారు. దొంగతనానికి గురైన సెల్‌ఫోన్లు కొనుగోలు చేసిన వారు కూడా చిక్కుల్లో పడకతప్పదని ఆయన హెచ్చరించారు. సోషల్ మీడియా, సైబర్ క్రైం టీం ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, సిబ్బందిని అభినందించారు.

కార్మిక నేతలపై కేసులు కొట్టివేత

తుని రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివీస్ వ్యతిరేక ఉద్యమంలో కార్మిక నేతలపై పోలీసులు పెట్టిన కేసులను కాకినాడ జిల్లా తుని కోర్టు సోమవారం కొట్టేసింది. 2016లో దివీస్ ఉద్యమకారులపై నమోదైన కేసులు ఎనిమిదేళ్ల పాటు కోర్టులో నడిచాయి. అనేక మంది సాక్షులను విచారించారు. పూర్వాపరాలను పరిశీలించి తుని మేజిస్ట్రేట్ తీర్పు ఇవ్వడంతో ఉద్యమకారులపై నమోదైన 10 కేసులు తుని కోర్టు కొట్టేసింది. రెండు కేసుల్లో 13 మంది ఉన్నారు. ఈ కేసును అడ్వకేట్ మల్లేశ్వరరావు వాదించారు.

సిగరెట్ కోసం..

మద్యం మత్తులో ఇద్దరి మధ్య కొట్లాట

తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


మరణించిన వీరబాబు

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిగరెట్ కోసం ఇద్దరి మధ్య మద్యం మత్తులో జరిగిన సంఘర్షణ వ్యక్తి ప్రాణాలను తీసింది. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట పట్టణంలో ఆదివారం రాత్రి జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండపేటలోని ఎస్సీకాలనీ 7వవార్డులో ఉన్న విశ్రాంతి మందిరంలో కాలనీకి చెందిన సుందరపు వీరబాబు నిద్రిస్తున్నాడు. అతడి వద్దకు అదే కాలనీకి చెందిన వేమగిరి సురేష్ తాగి వచ్చి చలిగా ఉంది సిగరెట్ కావాలని అడిగాడు. వీరబాబు తన వద్ద సిగరెట్ లేదని చెప్పాడు. సిగరెట్ కోసం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. మాట మాట పెరిగి కొట్లాటకు దారితీయడంతో సురేష్ వీరబాబుపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అతడిని ఆదివారం రాత్రి 108వాహనంలో మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ వీరబాబు(35) సోమవారం మృతిచెందాడని పోలీసులు తెలిపారు. వీరబాబుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ హరికోటిశాస్త్రీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ సంఘటనపై రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ దొర్రాజు విచారణ చేపట్టారు. క్లూస్‌టీం డాగ్‌స్క్వాడ్ సంఘటన స్థలాన్ని పరిశీలించాయి. మృతదేహానికి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మండపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం కేశవరంలో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతదేహంపై ఎరుపుతెలుపు గీతల చొక్కా, పట్టుపంచె, పసుపురంగు తువ్వాలు ఉన్నాయి. స్థానికులు మండపేట రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సారాతో మహిళ అరెస్టు

ఆత్రేయపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉచ్చిలిలో ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో సోమవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఉచ్చిలికి చెందిన వెంకటలక్ష్మిని ఐదు లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.

దుర్గాలయాల్లో మహిళలు పూజలు

అల్లవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలమ్మ స్వర్గం పర్వదినం సందర్భంగా మహిళలు గోదావరి పాయలు, పంట కాలువల్లో పూజలు చేసి దీపాలు వదిలారు. దుర్గాలయాలను సందర్శించి ఆలయాల్లో పూజలుచేశారు. బెండమూర్లంక, డి.రావులపాలెం, అల్లవరం, కొమరగిరిపట్నం తదితర గ్రామాల్లో మహిళలు పూజలు నిర్వహించారు.

383 ఎకరాల్లో సార్వా పంట నీట మునక





మామిడికుదురు: నగరం బైపాస్ రోడ్డులో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతు

ఉప్పలగుప్తం: చినగాడవిల్లిలో నేలకొరిగిన పైరును పరిశీలిస్తున్న ఏరువాక శాస్త్రవేత్త నందకిశోర్

● నిద్రావస్థ రకాలు సైతం మొలకెత్తే ప్రమాదం

ఉప్పలగుప్తం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల్లో కురిసిన అధిక వర్షాలకు మండలంలోని పది గ్రామాల్లో 383ఎకరాల విస్తీర్ణంలో సార్వా పైరు నీటమునిగిందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎం.నందకిశోర్ తెలిపారు. సోమవారం ఆయన మండలంలో పర్యటించి నీట మునిగిన సార్వా చేలను పరిశీలించారు. మండలంలో 4,481ఎకరాల్లో సార్వా సాగు జరిగిందని, 1961ఎకరాల్లో మాత్రమే కోతలు జరిగినట్టు మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు చెప్పారు. ప్రస్తుతం వరిపైరు సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ఏరువాక శాస్త్రవేత్త రైతులకు వివరించారు. నిద్రావస్థ ఉన్న రకాల్లో కూడా పైరు నేలనంటి ఎక్కువ రోజులు నీటిలో ఉంటే నిద్రావస్థ తొలగి గింజలు మొలకెత్తే అవకాశముందన్నారు. దీని నివారణకు అయిదు శాతం ఉప్పు ద్రావణాన్ని పైరుపై పిచికారీ చేయాలని సూచించారు.

తడిసిన ధాన్యంతో నష్టం

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ శాంతించడంతో సోమవారం వాతావరణం కొద్దిపాటి మార్పు రావడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మామిడికుదురు నుంచి గెద్దాడ వరకు ఏర్పాటుచేసిన బైపాస్ రోడ్డులో ఉంచిన తమ ధాన్యం రాశులను ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. రెండు రోజులుగా కురిసిన వర్షం ధాన్యం రాశుల కింద ప్రదేశానికి చేరడంతో ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని రహదారిపై ఆరబెట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. సోమవారం సాయంత్రం మరలా వాతావరణంలో స్వల్ప మార్పులు సంభవించడంతో రైతులు ధాన్యాలను మరలా టార్పాలిన్లు కప్పుకుని రక్షించే పనిలో పడ్డారు. కొన్ని గ్రామాల్లో వరిచేలు నేలనంటి వర్షపు నీరు చేరడంతో చేలల్లో చేరిన వర్షపు నీటిని బయటకు తరలించడానికి రైతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఏదేమైనప్పటికీ ఫెంగల్ తుఫాన్ తమ పాలిట శనిలా దాపురించిందని రైతులు పేర్కొంటున్నారు.

వైభవంగా పోలి పాడ్యమి పూజలు





అమలాపురం: చినచంద్రపురం లోయర్ కౌశిక నదీపాయలో దీపాలు వదులుతున్న మహిళలు

మామిడికుదురు: పెదపట్నంలంక గోదావరి చెంతన దీపాలు వదులుతున్న మహిళలు

అమలాపురంరూరల్/టౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని పోలి స్వర్గం కార్యక్రమంలో భాగంగా సోమవారం తెల్లవారుజాము నుంచి వేలాది మంది మహిళలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని అప్పర్‌కౌశిక, లోయర్ కౌశిక నదీపాయలతో పాటు ప్రధాన పంట కాల్వల వద్ద మహిళలు కార్తీక దీపాలను విడిచిపెట్టారు. బండారులంక శివారు చినచంద్రపురంలో లోయర్ కౌశిక వద్ద పుష్కర శివలింగం వద్ద వందలాది మంది మహిళలు పూజలు నిర్వహించారు. శ్రీజ్యోతిర్లింగ ట్రస్టు, కనకదుర్గ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా విస్తృత ఏర్పాట్లు చేశారు. ఈదురుగాలులు వీస్తుండడంతో దీపాలు వెలిగించేందుకు మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేకాకుండా పలు ప్రాంతాల్లో పంటకాల్వలు, నదీపాయల చెంతన వర్షాల బురదతో మహిళలు అవస్థలు పడ్డారు. లోయర్‌కౌశిక నదీపాయ వద్దకు అంబాజీపేట, అమలాపురం మండలాల నుంచి అధికసంఖ్యలో మహిళలు తరలిరావడంతో స్థానిక గౌరీ మల్లికార్జునస్వామి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల వేదికలను ఏర్పాటు చేశారు. ఆలయ పురోహితుల ఆధ్వ ర్యంలో పూజా కార్యక్రమాలు అనంతరం మహిళలు వంతుల వారీగా కార్తీక దీప ఉద్యాపనకు పంపించారు. అమలాపురం ఎన్టీఆర్ మార్గ్‌లోని చల్లపల్లి-అమలాపురం ప్రధాన పంటకాల్వలో కార్తీక దీపాలు వదిలే కార్యక్రమాలను నిర్వహించారు. ఎన్టీఆర్ మార్గ్‌లోని శ్రీనాగలింగేశ్వర స్వామి ఆలయం వద్ద కార్యక్రమం జరిగింది.

అఖండ అన్నసమారాధన

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ఉన్న శివాలయాల్లో కార్తీక మాసం ముగింపు సందర్భంగా సోమవారం తెల్లవారుజామున పాడ్యమి దీపాలు వదిలారు. గోదావరి, పంటకాల్వల్లో, చెరువుల్లో అరటి డొప్పలపై అధిక సంఖ్యలో దీపారాధనలు చేశారు. మోరి శ్రీప్రసన్నాంజనేయస్వామి, శేషారాయుడు కాల్వగట్టు వద్ద గ్రామస్తులు అధిక సంఖ్యలో పాడ్యమి దీపాలు వదిలి ప్రత్యేక పూజలు చేశారు. అంతర్వేది కొత్తవంతెన వద్ద శ్రీఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో భారీ అఖండ అన్నసమారాధన జరిగింది. సుమారు 2వేల మంది భక్తులకుపైగా ఈఅన్నసమారాధనలో పాల్గొన్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

కార్తీకానికి వీడ్కోలు

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల రోజుల పాటు పూజలు నిర్వహించి భక్తులు కార్తీకమాసానికి దీపాలు వదిలి సోమవారం తెల్లవారుజామున వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా వైనతేయ నదీ తీరంలోని పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, పాశర్లపూడి గ్రామాల్లోని నదీ తీరాల్లో భక్తుల సందడి కనిపించింది. కార్తీకమాసం ముగింపును పురస్కరించుకుని భక్తులు గోదావరి, కాల్వల్లోను దీపాలు వదిలారు. కార్తీకం తరువాత వచ్చే మార్గశిర మాసానికి స్వాగతం పలుకుతూ పూజలు చేశారు.

వైభవంగా పోలి స్వర్గం

పి.గన్నవరం, నవంబరు2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ముగింపు సందర్భంగా పోలిస్వర్గంలో భాగంగా భక్తులు పాడ్యమి దీపారాధనలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు సమీప గోదావరినది, స్థానిక పంటకాల్వలు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలు జలపాతంలో వదిలారు. అనంతరం శివాలయాలు వద్ద దీపారాధనలు చేసుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. బెల్లంపూడి శ్రీబాలాత్రిపురసుందరి సమేత లక్ష్మేశ్వరస్వామి ఆలయం, పి.గన్నవరం గరుడేశ్వర స్వామి ఆలయం, మొండెపులంక శ్రీపార్వతిరామ లింగేశ్వరస్వామి ఆలయాలు, ముంగండ, కారుపల్లి, వై.కొత్తపల్లి, ఉడిమూడి, నరేంద్రపురం, కుందాలపల్లి, మానేపల్లి తదితర గ్రామాల్లో శివాలయాల వద్ద భక్తులు కార్తీకమాసం ముగింపు సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు.

శివాలయాలు భక్తులతో కిటకిట

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరిరోజు కావడంతో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. తెల్లవారుజామున మహిళలు కౌశిక, పంట కాలువలో దీపాలను వదిలారు. ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండలంలోని ఏకాదశ రుద్రుల ఆలయాలతో పాటు నందంపూడి, మాచవరం, తొండవరం, వాకలగరువు, చిరతపూడి, ఇసుకపూడి గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో అభిషేకాలు, పూజలు చేశారు.

రజకులకు రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి



కలెక్టరేట్ ఎదుట రజకుల ధర్నా

అమలాపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో రజకులపై దాడులు పెరగడంతో పాటు కులం పేరుతో దూషిస్తున్నారని, తక్షణం రజకులకు ప్రత్యేక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ అమలాపురం తాలూకా, పట్టణ రజక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. మలికిపురం మండలం గూడపల్లికి చెందిన రామేశ్వరపు జైసాయి యువరాజ్‌ను కిడ్నాప్‌చేసి మలికిపురంలో అత్యంత దారుణంగా దాడిచేసి గాయపరిచారని చెప్పారు. ప్రధాన నిందితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన వెంటనే అరెస్టు చేసి బాధితునికి ప్రాణహాని లేకుండా చూడాలన్నారు. ధర్నాలో పి.నాగరాజు, కేవీవీఎస్ఎన్ మూర్తి, జి.బాబూరావు, పేట వెంకటేశ్వరరావు, పేట నాగరాజు, కొండేటి సత్యనారాయణ, కేశనకుర్తి పాపారావు, నేదునూరి వెంకటరమణ పాల్గొన్నారు.

అధ్వానంగా సఖినేటిపల్లి రహదారులు



చెరువును తలపిస్తున్న సఖినేటిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సెంటర్ నుంచి సఖినేటిపల్లిపాలెం సినిమాహాలు సెంటర్‌కు వెళ్లే రహదారి కొద్దిపాటి వర్షానికే చెరువును తలపిస్తోంది. ఉదయం స్కూలు బస్సులు, ఆర్టీసీ బస్సులు వెళ్లేటప్పుడు రోడ్డుకు అనుకుని ఉన్న వ్యాపారస్తులు సైతం తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గతంలో ప్యాచ్ వర్కు చేసినా మళ్లీ భారీ గుంతలమయంగా రోడ్డు తయారైందని గ్రామస్తులు వాపోతున్నారు. సినిమాహాలు సెంటర్ నుంచి మూడు తూములు వైపు వెళ్లే రహదారి కూడా గోతులు పడడంతో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలో రహదారులు ఛిద్రంగా గుంతలు పడి ఉన్న వాటిని గుర్తించి అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

బెల్టుషాపు నిర్వాహకులు బైండోవర్

అమలాపురం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బండారులంకలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న పిల్లి మోహనరావు, పిల్లి దేవిలను అదుపులోకి తీసుకుని అమలాపురం తహశీల్దార్ జీడీ కిశోర్‌బాబు కోర్టులో హాజరుపరిచినట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. ఎస్ఐ బాలాజీ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఒక్కొక్కరికీ రూ.5లక్షల పూచీకత్తుపై బైండోవర్ చేసినట్టు సీఐ తెలిపారు.

జాతీయ పోటీలకు జి.వేమవరం విద్యార్థులు





ఐ.పోలవరం విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

అంబాజీపేట: పూర్ణలక్ష్మిప్రసన్న

ఐ.పోలవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జి.వేమవరం హైస్కూల్ విద్యార్థినులు లంకలపల్లి చినతల్లి, బొమ్మిడి పూర్ణిమవెంకటదుర్గ అండర్-17 బాలికల సాఫ్ట్ బాల్ విభాగంలో జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. గత నెల28 నుంచి 30 వరకు కాకినాడ క్రీడాప్రాధికార సంస్థ ప్రాంగణంలో జరిగిన స్కూల్ గేమ్స్‌లో ఈఎంపికలు జరిగినట్టు హెచ్ఎం సలాది వెంకటనారాయణ తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 5నుంచి 10వరకు మహారాష్ట్రలో జరిగే జాతీయ పోటీల్లో చినతల్లి, దుర్గ పాల్గొంటారన్నారు. సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ఎం, కోచ్ అడ్డగళ్ల రాంబాబు, పీఎంసీ చైర్మన్ బసవా అప్పారావు విద్యార్థినులను అభినందించారు.

జాతీయ పోటీలకు పూర్ణలక్ష్మి ఎంపిక

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సపక్‌తక్రా పోటీలకు ఇసుకపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన కన్నేటి పూర్ణలక్ష్మిప్రసన్న ఎంపికైనట్టు హెచ్ఎం ఎఎల్ వరప్రసాద్ తెలిపారు. 27వ రాష్ట్రస్థాయి సపక్‌తక్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో గత నెల 26, 27 తేదీల్లో నంద్యాల జిల్లా నందుకొట్కూరులో జరిగిన సబ్‌జూనియర్ సపక్‌తక్ర పోటీల్లో లక్ష్మిప్రసన్న ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. ఈనెలలో కేరళలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థిని పాల్గొననున్నట్టు హెచ్ఎం తెలిపారు. లక్ష్మీప్రసన్న, పీడీ బూల చిరంజీవినిసర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబూరావు, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎస్ఎంసీ చైర్మన్ పళ్ల స్వామినాయుడు, కమిటీసభ్యులు, ఉపాధ్యాయులుఅభినందించారు

సేవా కార్యక్రమాలు

అమలాపురంటౌన్,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): అమలాపురం శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమం ఆధ్వర్యంలో దాతల సహకారంతో సోమవారం 120మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యోగాశ్రమ నిర్వాహకుడు ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తురగా సాయి, చిలుకూరి వివేక, దుర్గ పాల్గొన్నారు.

మరిన్ని క్రీడావిభాగాలు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

యానాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం క్రీడా మంత్రిత్వ శాఖకు సంబంధించిన స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయి) యానాం శాఖలో మరిన్ని క్రీడా విభాగాలు కేటాయించాలని సాయిస్పోర్ట్స్ రీజనల్ డైరెక్టర్ కిషోర్ కుమార్‌ను పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. ఈమేరకు ఆయనకు మల్లాడి వినతిపత్రం అందజేశారు. రెండు రోజుల పర్యటనకు రీజనల్ డైరెక్టర్ యానాం వచ్చారు. స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడా మైదానంలో ఉన్న స్పోర్ట్స్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మల్లాడితో కలిసి షటిల్ ఆడారు. అనంతరం యానాం పరిపాలనాధికారి మునిస్వామి కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మల్లాడి కృష్ణారావు హాజరయ్యారు. ఈసందర్భంగా మల్లాడి మాట్లాడుతూ యానానికి ఈసెంటర్ తీసుకురావడంలో రీజనల్ డైరెక్టర్‌తో పాటు కాకినాడకు చెందిన ఢిల్లీలో ఐఏఎస్ పాత్ర ఎంతో ఉందన్నారు. యానానికి మరిన్ని క్రీడా విభాగాలు ఏర్పాటు చేయడంతో పాటు స్థానిక క్రీడాకారులకు ప్రాధాన్యం ఇవ్వలని కోరారు. కార్యక్రమంలో సాయి స్పోర్ట్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లకు దరఖాస్తు చేసుకోండి

అమలాపురం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పారాలీగల్ వలంటీర్స్‌గా పనిచేసేవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మండల లీగల్‌స ర్వీసెస్ కమిటీ చైర్మన్, అమలాపురం రెండో అదనపు జిల్లా జడ్జి వి.నరేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్లు నిండి మెట్రిక్యులేషన్, తత్సమానమైన అర్హత కలిగిన అభ్యర్థులు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు, ఉద్యోగులు, సీనియర్ సిటిజన్లు, వైద్యులు, న్యాయవిద్యను అభ్యసించేవారు, ఎన్జీవోలు, మైత్రి సంఘాల సభ్యులు, సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు ఈనెల 21వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలన్నారు. మౌఖిక పరీక్ష ఆధారంగా ఎంపిక జరుగుతుందన్నారు.

వైభవంగా అన్నాభిషేకం

అమలాపురం టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమలాపురం మంచినీటి కుళాయి చెరువుగట్టున ఉన్న శ్రీమహాగణపతిస్వామి ఆలయంలో రామేశ్వరపు మణికంఠశర్మ ఆచార్య బ్రహ్మత్వంలో సోమవారం వైభవంగా అన్నాభిషేకం, రుద్రహోమం నిర్వహించారు. కార్తీక మాస రుద్రాభిషేక దీక్ష విరమణ సందర్భంగా ఉమామహేశ్వరస్వామికి అన్నాభిషేకం జరిపించారు. రుద్రహోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త రేలంగి కుమార్‌శంకర్‌గౌడ్ ఆధ్యాత్మిక ప్రవచనం అందించారు. ఆర్ఎస్ఎస్ నాయకులు బులుసు జగదీష్, పులిమే రాజా తదితరులు పాల్గొన్నారు. అన్నసమారాధన నిర్వహించారు.

అంబేడ్కర్, పీవీ రావుల ఆశయ సాధనకు కృషి చేయాలి

అల్లవరం,డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఉన్నత విద్యను అభ్యసించి అంబేడ్కర్, పీవీ రావుల ఆశయ సాధనలో భాగంగా హక్కుల కోసం కృషి చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్ అన్నారు. బోడసకుర్రు కంసాల మామిడి వద్ద మాలల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, మోసుగంటి దుర్గారావు, సాపే ధర్మరాజు, అంబటి శ్రీను, ఎ.గోపాలం, రొక్కాల నాగేశ్వరరావు, జల్లి రాధాకృష్ణ, బాలాజీ, వి.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామ బహిష్కరణపై విచారణ జరపాలి

గెద్దనపల్లి మత్స్యకారులు కలెక్టర్‌కు వినతి



కలెక్టరేట్‌లో గెద్దనపల్లి మత్స్యకారులు

అమలాపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన మత్స్యకారులను గ్రామ బహిష్కరణ చేసి నీరు, నిప్పు, ఏవిధమైన సహాయం చేయకూడదని తీర్మానం చేసిన సంఘటనపై విచారణ జరిపి అందుకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో అర్జీ అందించారు. కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. చేపలవేట పైనే ఆధారపడి పలు గ్రామాల్లో వేట చేసుకుంటామని తెలిపారు. గచ్చుకాయల పొర గ్రామంలో ఎన్నో ఏళ్లుగా చేపల వేట చేసుకుంటున్న తమను అడ్డుకుని గ్రామంలోకి వస్తే చంపుతామని బెదిరిస్తూ గ్రామ బహిష్కరణ చేశారని ఆరోపించారు. నిరసనలో మల్లాడి శ్రీనువెంకటరెడ్డి, పి.కాశీలింగేశ్వరుడు, సంగాని కాసులు, పోతాబత్తుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు

అంతర్వేది, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి సమతా కల్యాణ మండపంలో పాస్టర్స్ ఫెలోషిప్ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో యువకులు ఎక్కువగా డ్రగ్స్‌కు బానిసలుగా ఉన్నారని, వారందరినీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. డ్రగ్స్ రహిత నియోజకవర్గంగా రాజోలును తీర్చిదిద్దుతానని చెప్పారు. సమతా కల్యాణ మండపాన్ని అన్ని హంగులతో తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ గంటా షారోన్‌కుమార్, జాన్ మంగాచార్యులు, బిషప్ పి.శామ్యూల్‌పిన్ని, ఎంపీపీ వీరా మల్లిబాబు, సరెళ్ల విజయ్‌ప్రసాద్, గుండుబోగుల పెద్దకాపు, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

ఐక్యక్రిస్మస్ వేడుక

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఈనెల5న ఐక్యక్రిస్మస్ వేడుకలను నిర్వహిస్తున్నట్టు అధ్యక్షకార్యదర్శులు ఎల్.లాజరస్, ఆర్.విలియమ్స్, మీడియా సెల్ కుసుమే రత్నం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు డానియేలు, ధనరాజ్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

మామిడికుదురు, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మాదాశి శివకృష్ణ(35) మృతిచెందినట్టు నగరం హెచ్‌సీ కేవీవీఎస్వీ ప్రసాద్ సోమవారం తెలిపారు. గతనెల 28న మధ్యాహ్నం శివకృష్ణ స్కూటీ మోటారుసైకిల్‌పై తాటిపాక నుంచి కడలి వెళుతుండగా గెద్దాడలో పాసింజర్ ఆటోడ్రైవర్ నిర్లక్ష్యంగా వెనుక వస్తున్న వాహనాలను గమనించకుండా బ్రేక్‌వేశాడు. ఆటో వెనుక వస్తున్న శివకృష్ణ ఆగిన ఆటోను ఢీకొట్టి గాయపడ్డాడు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శివకృష్ణ ఆదివారం మృతిచెందాడు. హెచ్‌సీ కేసు దర్యాప్తు చేపట్టారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మలికిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ పరిధిలోని 11 నీటి సంఘాలు గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన కూటమి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ సంఘం పరిధిలో నలుగురు కూటమి నాయకులతో కమిటీలు ఏర్పాటుచేశామన్నారు. 11సంఘాలకు చెందిన కమిటీలు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి రైతు సేవలో పాల్గొనే నాయకులను గుర్తించి పోటీ చేయించాలన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

మోరి శివాలయానికి రూ.లక్ష విరాళం

మలికిపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మోరి శ్రీపార్వతీ రామలింగేశ్వర స్వామి దేవాలయ పునర్నిర్మాణ నిమిత్తం సోమవారం అడ్డాల కనకం(బాబ్జి)-వరలక్ష్మి దంపతుల కుమార్తె జ్యోష్నామణి రూ.1,00,116 విరాళం అందజేశారు. శివాలయం నిర్మాణానికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ రూ.కోటి మంజూరు చేయించారు. ప్రజావిరాళంగా రూ.30లక్షలు చెల్లించాల్సి ఉన్నందున గ్రామస్తులు విరాళాల సేకరణ మొదలుపెట్టారు. కార్యక్రమంలో అడ్డాల బాబ్జి, కామిశెట్టి సూరన్న, బళ్ల లక్ష్మణ్, చింతా నరసింహారావు, పిండి రామారావు, ముప్పర్తి సత్యశ్రీనివాస్, జాన సునీల్, కడలి వెంకటరత్నం పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు దీప్తి స్కూలులో విద్యార్థులకు సోమవారంస్థానిక అంజు కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బీవీవీ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పలువురు విరాళాలు అందించారు. అమలాపురం అగ్రహారానికి చెందిన పోతుల దుర్గాప్రసాద్-సత్యవెంకటరమణి దంపతులు రూ.20వేలు, కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన వి.వెంకటసత్యనారాయణ-వెంకటసునీత దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు అర్చకులకు ఆశీర్వచనంచేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.

కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి వెల్ఫేర్ అసిస్టెంట్ సోమవారం ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశాడు. క్రాపచింతలపూడిపాలెం పంచాయతీ పరిధికి చెందిన ర్యాలి సుబ్బారావు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. సుబ్బారావుకు పళ్లవారిపాలెం వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ హుస్సేన్ ఆసుపత్రికి వెళ్లి వృద్ధాప్య పింఛన్ అందించాడు.

దివ్యాంగుల దినోత్సవం నిర్వహించాలి

అమలాపురంటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి):కోనసీమ జిల్లాలోదివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించాలని కోరుతూ దివ్యాంగుల సంక్షేమ సంఘ జిల్లాశాఖ గౌరవాధ్యక్షుడు మోటూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.మదన్మోహనరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ ఉమ్మడితూర్పుగోదావరి జిల్లాలో మాత్రమే వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. ఈఏడాది నుంచి జిల్లాలో ప్రత్యేకంగా జిల్లాస్థాయి దివ్యాంగుల దినోత్సవం నిర్వహించాలని కోరారు. అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రూ.15వేలుపెన్షన్ పొందేవారికి సదరం సర్టిఫికెట్లు జారీ కి చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగ సంఘాల నాయకులు కొనన సత్యసుబ్రహ్మణ్యం, నల్లా గుర్రయ్యనాయుడు, ధర్మాడి సత్యం, సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం పోలమ్మచెరువుగట్టు వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ పి.రవివర్మ, టీడీపీ నాయకులతో కలిసి వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించారు. ముమ్మిడివరం పట్టణ ప్రజలకు వాకింగ్ ట్రాక్ అవసరం ఉన్నందున పోలమ్మ చెరువుగట్టు వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2019లో వచ్చిన జిమ్ పరికరాలు ఇంతవరకు వినియోగించక పోవడంతో వాటిని ట్రాక్ వద్ద వ్యాయామం చేసే యువకులకు అందుబాటులో ఉంచాలని ఆయన సూచించారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట దేశ నాయకుల విగ్రహాలు ఉన్న ప్రదేశాన్నంతా సుందర ప్రదేశంగా తీర్చిదిద్దాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట గొలకోటి దొరబాబు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, విళ్ల వీరాస్వామినాయుడు, ఏపీ టీవీ సుధాకర్ తదితరులు ఉన్నారు.

క్రిస్మస్ వేడుకలు

ముమ్మిడివరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరల్డ్ పీస్ ఇంవాజిలికల్ చర్చిలో జీసెస్ క్రైస్ట్ పాస్టర్ ఫెలోషిప్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు రెవ వజ్రపు జోసెఫ్ అధ్యక్షతన సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ వేడుకల్లో రెవ డాక్టర్ భరత్‌కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అందించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట గొలకోటి దొరబాబు, నడింపల్లి శ్రీనివాసరాజు, కురసాల శివ, గొల్లపల్లి గోపి, చిక్కాల అంజిబాబు, విళ్ల వీరాస్వామినాయుడు, సత్తిబాబులతో పాటు పలువురు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జేసీపీఎఫ్ కమిటీ అధ్యక్షుడు రెవ వజ్రపు జోసెఫ్, గౌరవాధ్యక్షుడు డీఎస్ రాజు, రెవ గుంట్రు జయరాజు, ఉపాధ్యక్షుడు పండు క్రిస్టాఫర్‌మోసెస్, కార్యదర్శి కొంకి ఇస్సాకు, సహాయ కార్యదర్శి మల్లవరపు దావీదురాజు, కోశాధికారి ఉండ్రాజవరపు ప్రసాద్, సహాయ కోశాధికారి సాపే స్టీఫెన్‌పాల్, కమిటీ అడ్వైజర్స్ కుంచే డానియల్‌రాజు, సరెళ్ల ప్రశాంతకుమార్, నక్కా క్రిస్టాఫర్, మల్లాడి సంతోష్‌లతో పాటు క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు నిత్యావసరాలు పంపిణీ

అయినవిల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చింతనలంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో కట్టుబట్టలతో మిగిలిన బాధిత కుటుంబాలకు ఏపీ షెడ్యూల్డు కులాల సంక్షేమసంఘం అయినవిల్లి మండలశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిత్యావసర సరుకులు, వస్తువులు పంపిణీ చేశారు. ఏపీ ఎస్సీ వెల్ఫేర్ అధ్యక్షుడు బీర సందీప్, జిల్లా కార్యదర్శి గోసంగి బంగార్రాజు, అసోసియేట్ అధ్యక్షుడు నేరేడుమిల్లి సత్యనారాయణ, గుమ్మడి వెంకట్, టి.సత్యనారాయణ, రాయి వెంకటేశ్వరరావు, మల్లవరపు చంద్రరావు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా వెంకటేశ్వరరావు

అంతర్వేది, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి తహశీల్దార్‌గా ఎం.వెంకటేశ్వరరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయనను ఆర్ఐ రామరాజు, వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సీతారామ్, రెవెన్యూ ఉద్యోగులు మర్యాద పూర్వకంగా కలుసుకుని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.


రాష్ట్ర స్థాయి పోటీల్లో గోడి గురుకుల విద్యార్థుల ప్రతిభ

అల్లవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పెదవేగి గురుకుల కళాశాలలో నవంబరు 28నుంచి 30వరకు జరిగిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గోడి బాలుర కళాశాల విద్యార్థులు తమ సత్తాచాటారు. రాష్ట్రస్థాయి పోటీల్లో గోడి గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి సీహెచ్ క్రాంతికిరణ్ జావెలిన్ త్రోలో ద్వితీయ స్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ నక్కా శ్రీనివాస్ తెలిపారు. ఇంటర్ విద్యార్థి ఎస్.సతీష్‌కుమార్ జావెలిన్‌త్రో ద్వితీయ, డిస్కస్‌త్రోలో తృతీయ స్థానం సాధించాడన్నారు. రాష్ట్రస్థాయి విజేతలైన విద్యార్థులను రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, సర్పంచ్ తోట శ్రీదేవి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ బీర భరత్‌కుమార్, ఎంపీటీసీ కాండ్రేగుల వాణిఅచ్యుతం, పీడీ వి.నానిబాబు, పీఈటీ వై.సుబ్రహ్మణ్యం అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉప్పలగుప్తం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 3వతేదీ మంగళవారం చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చల్లపల్లి, గోపవరం, ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్లపై ట్రీట్రిమ్మింగ్, లైన్ల మరమ్మతులు నిర్వహిస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ ఎం.రవికుమార్ తెలిపారు. ఈకారణంగా చల్లపల్లి, ఎస్.యానాం, గోపవరం, సరిపల్లి, వాసాలతిప్ప, అల్లవరం మండలం నక్కారామేశ్వరం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా తూరలు ఏర్పాటు.. అడ్డుకున్న స్థానికులు



నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేస్తున్న తూరలు

అంబాజీపేట, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం- అంబాజీపేట ప్రధాన రహదారిలో మాచవరం వినాయకుడి ఆలయం వద్ద రహదారి నిర్మాణంలో భాగంగా తూరలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆర్అండ్‌బీ రహదారులో నిత్యంలారీలు, బస్సులు, అధికలోడుతో వెళ్తుంటాయని, కల్వర్టు నిర్మించకుండా తూరలు ఏర్పాటుచేయడంతో తూరలు విరిగిపోయి రహదారి కుంగిపోతుందని స్థానికులు పనులను అడ్డుకున్నారు. తూరలు ఏర్పాటు చేసే సమయంలో కనీసం ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేదని విమర్శించారు. తూరలు ఏర్పాటు చేసి రహదారిపై ఉన్న నాసిరకం మెటీరియల్‌తో తూరలు పూడ్చారు.దీనిపై ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కల్వర్టు ఏర్పాటుచేసి తూరలు ఏర్పాటు చేయాలని కోరారు.

8న సంఘం శరణం గచ్చామి నాటక ప్రదర్శన

పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 8న రామచంద్రపురంలో ప్రదర్శించనున్న సంఘం శరణం గచ్చామి నాటకం కరపత్రాలు, పోస్టర్‌లను మంత్రి సుభాష్ ఆవిష్కరించారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు జూనియర్ కళాశాల ప్రాంగణంలో 8న సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 వరకు నాటిక ప్రదర్శన ఉంటుంద న్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, దళిత ఐక్య వేదిక నాయకులు న్యాయవాదులు గాలింకి చిట్టిబాబు, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

వెంటూరు సోమేశ్వరస్వామికి మంత్రి పూజలు

రాయవరం: మండలంలోని వెంటూరు పార్వతి సమేత సోమేశ్వరస్వామిని సోమవారం కార్మికశాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. సోమేశ్వరస్వామికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, అష్టోత్తర శతనామావళి పూజ, హారతి పూజల్లో పాల్గొన్నారు. టీడీపీ నేతలు ఆలయ విశిష్టతను మంత్రికి తెలిపారు. టీడీపీ రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాలదొర, మాజీ ఎంపీటీసీ చిరట్ల అప్పారావు, మేడిశెట్టి రాంబాబు, గుత్తుల శ్రీనివాస్, వల్లూరి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. ఏడువారాల నోము ఆచరిస్తున్న భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. అశేష భక్తజనం గోవింద నామస్మరణతో స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.3,96,036 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరుకు చెందిన గీర్ల శ్రీనివాసరావు, ఓంలత దంపతులు రూ.50 వేలు విరాళం ఇవ్వగా వారికి స్వామివారి చిత్రపటం అందించారు.



ఆలయంలో అష్టోత్తర పూజలు చేస్తున్న భక్తులు

నాటుసారాతో ముగ్గురి అరెస్టు



ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో నాటుసారాతో పట్టుబడిన నిందితులు

ఆలమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మండపేట మండలంలో అధికారులు జరిపిన దాడుల్లో ఇద్దరి నుంచి 75 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఆలమూరు ఎక్సైజ్ సీఐ ఐడి.నాగేశ్వరరావు తెలిపారు. మండపేట మండలంలో జరిపిన దాడుల్లో కేశవరం గ్రామంలో 70 లీటర్ల నాటుసారాను కె.రాంబాబు వద్ద స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. ఏడిద సావరం గ్రామంలో ఐదు లీటర్ల నాటుసారా తో కాండ్రేగుల సూరిబాబు అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఆయనతోపాటు ఎస్ఐ రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం: మండలంలోని ఉచ్చిలిలో ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని ఆధ్వర్యంలో సారా స్థావరాలపై దాడులు జరిపారు. ఉచ్చిలికి చెందిన వెంకటలక్ష్మిని 5 లీటర్ల నాటుసారాతో అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ కె.అన్నవరం తెలిపారు.



మూలస్థానంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేస్తున్న సేవా సమితి సభ్యులు

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

ఆలమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మూలస్థాన అగ్రహారం లో సోమవారం రాజమహేంద్రవరం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం జరిపారు. ఈ సందర్భంగా వక్తలు మార్గశిరమాసం ప్రాముఖ్యత తెలిపారు. దైవభక్తితో గ్రంథ పఠనం చేస్తే మంచి జ్ఞానాన్ని పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌బాబు, సభ్యులు పీఎస్ఎన్ మూర్తి, విజయ్, లక్ష్మీనారాయణ, లోహిత, భరత్, సూర్యకుమారి, సంధ్యారాణి, శోభారాణి పాల్గొన్నారు.

మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని
విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కె.గంగవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న జరిగే మెగా తల్లిదండ్రుల సమావేశాన్ని విజయవంతం చేద్దామని సమగ్రశిక్ష భవిత కోఆర్డినేటర్ ఎంటీబీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం కె.గంగవరంలోని ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు తెలపాలని, దాతల సాయంతో భోజనాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. తల్లిదండ్రులకు ఆహ్వాన పత్రాలు పంపాలని సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జరుపుతున్న సమావేశాన్ని సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంఈవో చోడిశెట్టి ఆంజనేయులు, ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పీవీ బ్రహ్మానందం, గంధం వెంకన్నబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. కూళ్ల, దంగేరు, కోటిపల్లి ఉన్నత పాఠశాలల్లోను సమావేశాలు జరిపారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థికసాయం

రాయవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి కుటుంబానికి సోమవారం రూ.27,500 బాధితుడి అక్క వెంకటలక్ష్మికి అందజేశారు. రాయవరం గ్రామానికి చెందిన యామాల వలస సత్యనారాయణ గతనెల 24న మోటారు సైకిల్ అదుపు తప్పి పడిన ఘటనలో గాయపడ్డాడు. అప్పటి నుంచి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి వైద్యం నిమిత్తం రాయవరం గ్రామానికి చెందిన దుర్గాపు వెంకన్నబాబుతోపాటు అతని స్నేహితుల నుంచి సేకరించిన 27,500 నగదును వారికి అందించారు. కార్యక్రమంలో పెద్దపాటి శాంతరాజు, ఖండవిల్లి సునీల్ కుమార్, నాగరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న దృశ్యం

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు సాయం

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఏడిద దేవుళ్ల కాలనీలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు చెందిన జి.రామలక్ష్మి, పలివెల వరలక్ష్మిలకు సోమవారం నిత్యావసర వస్తువులతో పాటు 50 కిలోల బియ్యం, రూ.11,000 నగదు అందజేశారు. వైసీపీ గ్రామ అధ్యక్షుడు పలివెల సుధాకర్ సారథ్యంలో బాధిత కుటుంబాలకు సోమవారం వీటిని అందజేశారు. కార్యక్రమంలో మండపేట మండల వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ తాతపూడి ఉషారాజేష్, వల్లూరి రామకృష్ణ, అర్జున్, తరుణ్, జెడ్‌పీటీసీ సభ్యురాలు కె.భవానిసాయి, మల్లా అజయ్ కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట

కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

నెలాఖరుకల్లా నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి) పట్టణంలో వున్న గృహాలు, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన పన్నులను నెలాఖరుకు నూరుశాతం వసూలు చేయాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రెవెన్యు సిబ్బందికి పలు సూచనలు చేశారు.

రహదారుల మరమ్మతులకు నిధులు

• కనుమరుగుకానున్న భారీ గోతులు • వాహనదారుల హర్షాతిరేకాలు

మండపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులు ఘోరంగా దెబ్బతిన్నా పట్టించుకున్న దాఖలాల్లేవు. ఈ రహదారులపై రాకపోకలు సాగించే వాహనదారులు ప్రతిరోజూ ప్రమాదాల బారినపడిన ఉదంతాలున్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధ్వాన్న రహదారులపై దృష్టిపెట్టింది. మరమ్మతులు చేసేందుకు అవకాశం ఉన్న వాటిని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. రోడ్లు భవనాలశాఖ ఆధ్వర్యంలో వున్న వాటికి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టింది. మండపేట నియోజకవర్గంలో రూ.4.5 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. నియోజకవర్గ పరిధిలో గల మూడు మండలాలు, మండపేట, కపిలేశ్వరపురం, రాయవరంతోపాటు మండపేట పట్టణంలో కూడా రహదారుల మరమ్మతులు చేపట్టారు. డిసెంబరు నెలాఖరునాటికి గోతుల్లేని రహదారులు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పలు చర్యలు చేపట్టింది. దీంతో అధికార యంత్రాంగం అనుకున్న సమయంలో పూర్తి చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.



ఏడిద వై.సీతానగరం రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఘనంగా పోలిపాడ్యమి పూజలు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారుజామున పోలి పాడ్యమి పూజలు జరిపారు. పోలి పాడ్యమిని పురస్కరించుకుని కాలువ రేవుల వద్ద మహిళలు దీపాలు వదిలారు. సోమేశ్వరం బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, వెంటూరు పార్వతి సోమేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాయవరం రాజరాజేశ్వర స్వామి, అన్నపూర్ణా సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, లొల్ల రామలింగేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వర స్వామి, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, వి.సావరం, భీమేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి

ఆత్రేయపురం: కార్తీకమాసం ముగియడంతో సోమవారం పోలిపాడ్యమి జరిపారు. వేకువజామునే మహిళలు అరటి డొప్పల్లో దీపాలు వెలిగించి కార్తీకమాసానికి వీడ్కోలు పలికారు. ర్యాలి ఉమా కమండలేశ్వరస్వామి, హనుమాన్, వాడపల్లి విశ్వేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. శివునికి అభిషేకాలు చేశారు. శివనామస్మరణతో ఆయా ఆలయాలు మారుమోగాయి.

కపిలేశ్వరపురం: మండలంలోని పలు గ్రామాల్లో పోలిపాడ్యమి పూజలను భక్తులు సోమవారం జరిపారు. వేకువజామునే మహిళలు ఆలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన నీటితొట్టెలో పలువురు దీపాలను వదిలిపెట్టారు. అధికసంఖ్యలో మహిళలు, భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

భీమేశ్వర ఆలయంలో...

ద్రాక్షారామ: ద్రాక్షారామ భీమేశ్వర ఆలయంలో పోలిపాడ్యమిని పురస్కరించుకుని భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే మహిళలు సప్త గోదావరిలో స్నానాలు చేసి పాడ్యమి దీపాలు వెలిగించారు. భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అశ్వత్థ నారాయణ వృక్షం చుట్టూ పలువురు భక్తులు ప్రదక్షిణలు చేశారు.

మండపేట: కార్తీకమాసం ముగియటంతో సోమవారం పోలీస్వర్గం పూజలను భక్తి శ్రద్ధలతో జరిపారు. వేకువజాము నుంచే శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండపేటతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కె.గంగవరం: పోలి పాడ్యమిని పురస్కరించుకుని మహిళలు సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే ఆయా ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించి పూజలు చేశారు. భక్తుల రద్దీతో ఆయా ఆలయాలు కిటకిటలాడాయి.



అంగర వేణుగోపాలస్వామి ఆలయంలో దీపాలు వదులుతున్న మహిళలు



అంగీకార పత్రం ఇస్తున్న దృశ్యం

అవయవ దానానికి అంగీకార పత్రం

ద్రాక్షారామ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామకు చెందిన రక్త, నేత్రదాన మోటివేటర్ కంచర్ల చక్రి తన 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని అవయవ దానానికి అంగీకార పత్రం అందించారు. సోమవారం కాకినాడ బాదం బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డా.దీవి రాజు మల్టీ ఆర్గాన్ ఫౌండేషన్‌కు అంగీకారపత్రం అందించారు. బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు టి.మూర్తి తదితరులు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ నరాల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, సుంకర చినకాపు తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయండి

కొత్తపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు లెక్చరర్స్ క్రమబద్ధీకరణకు విజయవాడలో 4న చేపట్టే సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని కాంట్రాక్టు లెక్చరర్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి చిక్కాల నరసింహం కోరారు. సోమవారం ఆయన ఒక ప్రకటనను విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం తమను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని పలు సార్లు విన్నవించామన్నారు. ఇప్పటికీ తమను పట్టించుకోలేదని విధిలేని పరిస్థితుల్లో సత్యాగ్రహ దీక్షకు దిగుతున్నామన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టు లెక్చరర్స్‌ను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే వేగుళ్లకు ఉద్యోగుల అభినందనలు

మండపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా ఉద్యోగులు సన్మానించారు. ఉమ్మడి జిల్లా నాన్ గ్రాడ్యుయేట్ పశు సంవర్థక శాఖ ఫెడరేషన్ ఛైర్మన్ ఈదల శ్రీనివాస చౌదరి సారథ్యంలో సోమవారం మండపేట పార్టీ కార్యాలయంలో ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కార్యవర్గ సభ్యులు సాంబమూర్తి, కె.శ్రీనివాస్, కె.విజయబాబు, షహినాషా, పట్టాభి తదితరులు పాల్గొన్నారు. కపిలేశ్వరపురం మండలానికి చెందిన పలువురు నాయకులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి అభినందించారు.

నిబంధనలకు విరుద్ధంగా తూరల ఏర్పాటు

అడ్డుకున్న స్థానికులు

అంబాజీపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం- అంబాజీపేట ప్రధాన రహదారిలో మా చవరం వినాయకుడి ఆలయం వద్ద రహదారి నిర్మాణంలో భాగంగా తూరలు ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఆర్అండ్‌బీ రహదారులో నిత్యంలారీలు, బస్సులు, అధికలోడుతో వెళ్తుం టాయని, కల్వర్టు నిర్మించకుండా తూరలు ఏర్పాటు చేయడంతో తూరలు విరిగిపోయి రహదారి కుంగిపోతుందని స్థానికులు పనులను అడుకున్నారు. తూరలు ఏర్పాటు చేసే సమయంలో కనీసం ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేదని విమర్శించారు. తూరలు ఏర్పాటు చేసి రహదారిపై ఉన్న నాసిరకం మెటీరియల్‌తో తూరలు పూడ్చారు.దీనిపై ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావుతో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కల్వర్టు ఏర్పాటుచేసి తూరలు ఏర్పాటు చేయాలని కోరారు.



ఎమ్మెల్యే వేగుళ్లను సన్మానించి అభినందనలు తెలుపుతున్న కాలేరు గ్రామ నాయకులు

ఎమ్మెల్యే వేగుళ్లకు నేతల సన్మానం

కపిలేశ్వరపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును టీడీపీ కాలేరు గ్రామ నాయకులు సోమవారం మండపేట పార్టీ కార్యాలయంలో అభినందించారు. ఆయనకు శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ అధ్యక్షులు ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, వల్లూరి కాశీవిశ్వనాధం, గుణ్ణం సత్యనారాయణ, మెర్ల తాతాజీ, టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తాల మధుసూదనరావు, ఎంపీటీసీ టేకి మంజు, వార్డు మెంబరు నాతి చంద్రశేఖర్, జనసేన నాయకులు పెయ్యల యాకోబు, విద్యా కమిటీ ఛైర్మన్ పలివెల రమేష్, కొల్లి జాన్, జి.నగేష్ తదితరులు పాల్గొన్నారు.



జాతీయ కాలుష్య నివారణ దినోత్సవంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రమాదేవి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కొత్తపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి పేర్కొన్నారు. సోమవారం జాతీయ కాలుష్య నివారణ దినోత్సవాన్ని విద్యార్థులతో కలిసి జరిపారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాలుష్య నియంత్రణను తమ బాధ్యతగా తీసుకుని పారిశుధ్యాన్ని పాటించటం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, చెట్లు నాటడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఈ పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ జి.శ్రీనివాసులు, పి.సాయికృష్ణ, డాక్టర్ కె.అంకమ రావు, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, డాక్టర్ కె. సత్యనారాయణ, విజయ కుమార్, ప్రసన్నజ్యోతి, సత్య తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణ చట్టాలపై అవగాహన

రావులపాలెం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిత సెల్ కన్వీనర్ డాక్టర్ సుమలత ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షతన మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులు, నివారణ చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిధిగా రాజమహేంద్రవరం కోర్టు న్యాయవాది ఎస్.విమల పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు.



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న దృశ్యం

మున్సిపల్ ఉద్యోగికి సన్మానం

మండపేట, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో వాటర్ ట్యాంకు డ్రైవర్‌గా 36 ఏళ్లపాటు పని చేసిన టి.సత్యనారాయణ ఉద్యోగ విరమణ సందర్భంగా సహచర ఉద్యోగులు సత్కరించారు. ఆయన సేవలను ఛైర్‌పర్సన్ పతివాడ నూకదుర్గారాణి, కమిషనర్ టీ.వీ.రంగారావు ప్రశంసించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ దంపతులను ఛైర్ పర్సన్ రాణి, కమిషనర్ రంగారావు, మున్సిపల్ డీఇ శ్రీనివాస్, సహచర ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగికి వీడ్కోలు: పట్టణ పోస్టాఫీసులో అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.శివయ్య ఏలూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సోమవారం సహచర ఉద్యోగులు ఆయనకు వీడ్కోలు పలికారు. పోస్టల్ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పోస్టుమాస్టర్ సుబ్బారెడ్డి అధ్యక్షతన వహించారు. శివయ్యను ఉద్యోగులు సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ ఉద్యోగులు కేవీ నారాయణరావు, కొండపల్లి సూర్యనారాయణ, ఎండీఎం షరీఫ్, టీ.ఫుల్లేశ్వరరావు, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.





ఉద్యోగ విరమణ చేసిన మున్సిపల్ ఉద్యోగిని సత్కరిస్తున్న కమిషనర్ ఛైర్‌పర్సన్ తదితరులు. పక్క చిత్రంలో ఏలూరుకు బదిలీపై వెళుతున్న పోస్టల్ ఉద్యోగిని సత్కరిస్తున్న సహచర ఉద్యోగులు



పెదపళ్ల రామాలయానికి అందించిన వస్తువులు

రామాలయానికి వెండి ఆభరణాల బహూకరణ

ఆలమూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల తూర్పు వీధి రామాలయంలోని స్వామి, అమ్మవార్లకు వెండి ఆభరణాలు అందించారు. రామాలయంలోని రాముడు, సీత, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలకు నాలుగు కిలోల వెండితో కిరీటాలు, పాదుకలు, ఇతర పూజా సామగ్రిని భక్తుల సహకారాలతో చేయించి బహూకరించారు. మరో భక్తురాలు రాముడికి బంగారు నామాలను అందించారు. వీటికి ప్రత్యేక పూజలు చేసి స్వామివార్లకు బహూకరించినట్టు ఆలయ కమిటీ నిర్వాహకులు నామాల రుద్రయ్య చౌదరి తెలిపారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

రావులపాలెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కొత్తపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ రౌతు ఈశ్వరరావు(కాశీ) అన్నారు. ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా ధాన్యం తడిసిపోకుండా ఉండేందుకు రాయితీపై రైతులకు బరకాలను అందించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు అందించాలని ఆయన తెలిపారు.



చెల్లూరులో విద్యుత్ సమస్యలపై ఏడీఏకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

విద్యుత్ సమస్యలపై వినతిపత్రం

రాయవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెల్లూరు గ్రామంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏడీఏ సీహెచ్ శ్రీధర్‌కు వినతిపత్రం అందించారు. చెల్లూరు సబ్‌స్టేషన్‌కు వచ్చిన ఏడీఏను ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు త్రీఫేజ్ కరెంటు ఇప్పించాలని, వెంటూరు, కూర్మాపురం ఫీడర్ రైతులకు త్రీఫేజ్ సరఫరా కంటిన్యూగా ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు.



శబరిమలకు ప్రయాణం అవుతున్న అయ్యప్పమాలదారులు

భక్తి శ్రద్ధలతో అయ్యప్పస్వాముల ఇరుముడి

రాయవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామంలోని సోమేశ్వరస్వామి ఆలయంలో అయ్యప్పమాలదారుల ఇరుముడి కార్యక్రమాన్ని సోమవారం భక్తి శ్రద్ధలతో జరిపారు. గ్రామానికి చెందిన కడియాల వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో 35 మంది అయ్యప్పమాలదారులు 41 రోజుల దీక్షను పూర్తి చేశారు. సోమవారం స్థానిక శివాలయంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి, శివపార్వతులు, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామికి పూజలు చేసిన అనంతరం గురుస్వామి చేతులమీదుగా ఇరుముడులు కట్టారు. అయ్యప్పశరణు ఘోష మధ్య వారు శబరిమలకు బయలుదేరారు. కార్యక్రమంలో అయ్యప్పస్వాముల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళాలు

మామిడికుదురు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి పలువురు విరాళాలు అందించారు. అమలాపురం అగ్రహారానికి చెందిన పోతుల దుర్గాప్రసాద్-సత్యవెంకటరమణి దంపతులు రూ.20వేలు, కృష్ణాజిల్లా కంకిపాడుకు చెందిన వి.వెంకటసత్యనారాయణ-వెంకటసునీత దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. దాతలకు అర్చకులకు ఆశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు.